# వాస్తవం
డెయిలీ.కామ్
డిజిటల్ పత్రిక
ఉన్నది ఉన్నట్లుగా
శుక్రవారం 31.07.2026
ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తం చేయాలి



4లో..

సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. గురు వారం సూపర్ ఎల్‌నినోపై రాజ న్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి హాజరయ్యారు.

# మంచిర్యాలలో రియల్ బురిడీ ?

- శ్రీగంధం మొక్కలతో వచ్చిన లాభమెంత?
- విలేకర్లకు ఏటీఎంలా రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ
- అనుకూలంగా ఉంటే డబ్బులు..లేదంటే కేసులు
- తాజాగా ముగ్గురిపైన కేసు నమోదు

5లో..

- కలం కావలి జనాలకా? రియల్ దందాలకా?
- ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారం సక్రమమేనా?
- సక్రమమైతే మీడియా సంస్థలకు డబ్బులు వెదజల్లడం ఎందుకు?
- ప్రశ్నించినవారిపైన కేసులు పెడితే అక్రమం సక్రమం అవుతుందా?
- రియల్ సంస్థని డబ్బుల కోసం వేధించిన పాత్రికేయులు
- ముగ్గురి మీద హడావిడిగా ఫిర్యాదు చేయడంలోని మర్మం ఏంటి?
- ఈ రియల్ దందాకు కావలిగా ఉన్న సిండికేట్ బ్రోకర్ జర్నలిస్టులు

మంచిర్యాల జిల్లాలో ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థపైన వివిధ రకాల మోసాలకు పాల్పడ్డారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి.కొన్ని పత్రికల్లో కథనాలు కూడా ఇటీవల ప్రచురితం అయ్యా యి. వ్యవసాయ భూములను ఫాం ల్యాండ్ పేరుతో అమ్ముతూ.. మోసాలకు పాల్పడుతున్నారని, శ్రీగంధం మొక్కలను పెంచి మీకు అధిక లాభాలు వచ్చేలా చేస్తామంటూ జనాలను బురిడీ కొట్టిస్తూన్నారం టూ అనేక ఆరోపణలు వస్తున్నాయి.ఈ విషయంలో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా..వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో అమ్మవచ్చా? అధిక లాభాలు చూపించి జనాలను మోసం చేయవచ్చా? ఫాం ల్యాండ్స్ అమ్మాలంటే చట్టాలు ఏం చెబుతున్నాయి. వెంచర్లు వేసి కస్టమర్లకు చేస్తున్న రిజిస్ట్రేషన్లలో ఉన్న లొసుగొలు ఏంటి? త్వరలోనే ఈ సంస్థ భారీ కుంభకోణం వెలుగులోకి రాబోతోందా? ఇలా అనేక ప్రశ్నలతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వస్తున్నాయి. ఈ విషయంపైన సదరు రియల్ సంస్థ స్పందించి ఆ వార్తలన్నీ తప్పు..ఇలా ప్రచారం చేసేవారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.అయినా ఈ సంస్థపైన సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతోపాటు పత్రికల్లో కథనాలు వస్తున్నాయి.ఇప్పటికే ఈ సంస్థ చేసిన వెంచర్లలో అధికారులు భారీస్థాయిలో డబ్బులు తీసుకుని అనేక అక్రమ రిజిస్ట్రేషన్లకు తెరతీశారని ఆరోపణలున్నాయి. నిజానికి ఈ సంస్థ తమ లోపాలను బయటకి రాకుండా ఉండటానికి దాదాపు 150 నుంచి 200 మీడియా ప్రతినిధులను ప్రతీ సంవత్సరం రూ.10 వేల నుంచి 20 వేల వరకు ప్రకటనల రూపంలో డబ్బులు ఇస్తారనే ప్రచారం ఉంది తాజాగా ఓ పత్రిక విలేకరి ఈ సంస్థపైన ఒక వార్త తమ పత్రికలో రాయడంతో ఆ సంస్థ యజమాని సదరు పత్రికా విలేకరితో బేరసారాలు ఆడినట్లుగా తాజాగా పోలీసులకు సదరు సంస్థ యజమాని ఇచ్చిన ఫిర్యాదులోనే అంగీకరించడం విశేషం.




# 2034 వరకూ నేనే సీఎం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయం
- ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది
- ఓట్లు, రాజకీయాలు నాకు ముఖ్యం కాదు
- విద్యార్థుల కోసం ఎంత ఖర్చయిన ప్రభుత్వం భరిస్తుంది

విద్యావ్యవస్థ రాష్ట్రంలో బలప డిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిం చారు. తెలంగాణలోనూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యావ్యవస్థ ఉండాలనేది తమ ప్రభుత్వ లక్ష్య మని పేర్కొన్నారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఎంసీహెచ్ ఆర్డీలో ఫిన్‌లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. 'టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్‌చేంజ్' కార్యక్రమంలో భాగంగా ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఉపాధ్యాయుల బృం దం పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. జవాహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు వేసిన పునాదులతో ఇప్పుడు మన దేశంలో లైఫ్‌స్పాన్ పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు



4లో..

# పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

## ప్రకటించిన యశోద ఆసుపత్రి వైద్యులు



**హైదరాబాద్:** బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి 12.50 నిమిషాలకు కన్నుమూశారు. ఈమేరకు యశోద ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు. ఈనెల 26న ఉదయం హన్మ కొండలో ఆయనకు చాతిలో నొప్పి రావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు.కార్డియాక్ అరెస్ట్‌గా వైద్యులు గుర్తించారు. 9 సార్లు సీపీఆర్ చేశాక కొంత మేర ఫలితం కన్పించగా మెరుగైన వైద్యం కోసం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి గ్రీన్‌చానెల్ ద్వారా తరలించారు.అక్కడ వెంటిలేటర్‌పైన వైద్యం అందించారు.సుదీర్ఘకాలం స్పృహలో లేకపోవడంతో ఆయనలో నాడీ వ్యవస్థ స్పందన కన్పించలేదని వైద్యులు తెలిపారు. ఆక్సీజన్ లోపం కారణంగా మెదడుకు నష్టం జరిగినట్లు వివిధ పరీక్షల్లో తేలిందని వైద్యులు తెలిపారు. 5రోజుల అనంతరం గురువారం అర్ధ రాత్రి పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూశారు.ఆయనని బతికించడానికి వైద్యులు,కుటుంబ సభ్యులు,బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు చేసిన కృషి ఫలించలేదు.పెద్ది కన్నుమూతతో బీఆర్ఎస్ శ్రేణులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఇంగ్లండ్ కోచ్‌గా ఫ్లెమింగ్..సారథిగా జో రూట్



**లండన్:** ఇంగ్లండ్ టెస్టు క్రికెట్ జట్టులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. జట్టు ప్రధాన కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యవహరించనున్నాడు. ఇటీవలే ఈ బాధ్యతల నుంచి తప్పుకొన్న బ్రెండన్ మెకల్లమ్ స్థానంలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఫ్లెమింగ్‌ను నియమించింది. ఇక బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో టెస్టు జట్టు కెప్టెన్‌గా జోరూట్‌ను నియమించారు. గతంలోనూ(2017-2022) రూట్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

# సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి



3లో..

# భారీ వర్షాలతో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి గండి

**- ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలు**
**- ఓసిపిలలో చేరిన వర్షపు నీరు**
**- సంస్థకు భారీ నష్టం**

**వాస్తవం , గోదావరిఖని, జులై 30:**

రాష్ట్రంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సింగరేణి బొగ్గు ఉత్పత్తికి గండి పడింది. వర్షపు నీరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (ఓసీపీ) గనుల్లోకి భారీగా చేరడంతో గనుల్లోని పనులు నిలిచిపోయాయి.గత మూడు రోజులుగా గోదావరి బెల్ట్‌లోని సింగరేణి గనుల పరిధిలో కుండపోత వర్షం కురుస్తోంది. రామగుండంలో 13.5 సెంటిమీటర్ల వర్షం నమోదయ్యింది. దీంతో గనుల్లోకి వెళ్లే రోడ్లు బురదమయంగా మారాయి. కార్మికులు విధులకు రావడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలకు రామగుండం సింగరేణి ప్రాంతాల్లోని ప్రధాన ఓసీపీ గనులన్నీ నీటితో నిండాయి. గనుల్లోని పిట్‌లలో 20 నుంచి 30 అడుగుల మేర నీరు చేరింది. దీంతో ఎక్స్‌కవేటర్లు, డంపర్లు, డ్రిల్లింగ్ యంత్రాలు పనిచేయలేకపోతున్నాయి. విద్యుత్ సరఫరాకు కూడా అక్కడక్కడ అంతరాయం ఏర్పడింది. భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని గనుల్లో కార్మికులను అధికారులు లోనికి దిగడానికి నిరాకరిస్తున్నారు. ఉత్పత్తి నిలిచిపోవడంతో సింగరేణి సంస్థకు రోజుకు రూ. కోట్ల మేర నష్టం వస్తున్నట్లు అంచనా. తడిసిన బొగ్గు, రవాణా ఆలస్యం, మిషన్ల మరమ్మతుల కారణంగా అదనపు ఖర్చు పెరుగుతోంది. వర్షాలు తగ్గిన వెంటనే నీటిని బయటకు పంపి ఉత్పత్తిని పునఃప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.



సింగరేణి ఉన్నతాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం పెద్ద మోటార్లతో నీటిని బయటకు పంపే పనులు జరుగుతున్నాయి. వాతావరణం అనుకూలించిన 48 గంటల్లో ఉత్పత్తిని తిరిగి ప్రారంభించే అవకాశం ఉంది. వరుస వర్షాలతో బొగ్గు ఉత్పత్తి దెబ్బతినడంతో సింగరేణి లక్ష్యాలపై ప్రభావం పడే అవకాశం ఉందని సింగరేణి నిపుణులు అంటున్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## జైపూర్ ఎస్ ఐ భూమేష్

**వాస్తవం , జైపూర్, జులై 30**



రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వర్షాలతో వాగులు ప్రవహించే నీరు రోడ్డుపై రావడంతో ఆ ప్రాంతాలను తా త్కా లికంగా మూసి వేయడం జరిగినది. జిల్లాలో భారీ వర్షాలతో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, అదేవిదంగా అధికారులకు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు ఆదే శాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జైపూర్ ఎస్ ఐ మాట్లాడుతూ, భారీ వర్షాలు కు రుస్తుందున వల్ల ఉధృతంగా ప్రవహి స్తున్న వాగులు, వంకలు, చెరువులు నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉందని, వాటి వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు గోదావరి నది,చెరువులు దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యుత్ పరిక రా లను తాగవద్దు.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించడానికి జిల్లా పోలీసు అధికా రులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా 100కి లేదా స్థానిక పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలని జైపూర్ ఎస్ ఐ భూమేష్ సూచించారు.

# కన్నారంలో భూముల రీ సర్వే

**రైతులకు వరమా?**
**వివాదాలకు శ్రీకారమా?**

**వాస్తవం, హనుమకొండ,జూలై 30 :**

వ్యవసాయ భూముల రీ సర్వేలో భాగంగా హనుమకొండ జిల్లా,వేలేరు మండలం, కన్నారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం అభినందనీయమే. అయితే ఈ నిర్ణయం గ్రామ రైతుల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. ప్రభుత్వ పథకాల అమలులో ముందుండే ఇతర మేజర్ గ్రామాలు రీ సర్వే విషయంలో వెనక్కి తగ్గగా, కన్నారం గ్రామాన్నే ఎందుకు ఎంపిక చేశారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే పలు భూ వివాదాలతో సతమతమవుతున్న గ్రామంలో రీ సర్వే పేరుతో కొత్త సమస్యలు, కొత్త పంచాయతీలు తెరపైకి వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియను వివాదరహితంగా, పారదర్శకంగా నిర్వహించే బాధ్యత ఎవరిపై ఉంటుంది? అనే ప్రశ్నకు అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.గతంలో జరిగిన ఆర్వోఆర్ సవరణల సమయంలో తాతలు, ముత్తాతల పేర్లు ఉన్నాయని చెబుతూ దశాబ్దాలుగా సాగు చేస్తున్న రైతులను ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు ఇంకా ప్రజలు మర్చిపోలేదు. భూముల ధరలు పెరగడంతో వివాదాలు సృష్టించి, చివరకు డబ్బులు వెచ్చించి కొనుగోలు చేసిన అమాయక రైతులకే అన్యాయం జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి.ఒక తెల్ల కాగితం పట్టుకొని వచ్చి "ఈ సర్వే నంబరుపై మాకు వివాదం ఉంది... పట్టా ఇవ్వొద్దు" అని ఫిర్యాదు చేస్తే చాలు... నెలల తరబడి రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగిన రోజులు గుర్తున్నాయి. ఇప్పుడు అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా చూసేది ఎవరు? మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ భూముల వివరాలు సేకరించి రైతుల మధ్య చిచ్చుపెట్టే మధ్యవర్తులు, స్వార్థపరులైన నాయకుల ఆగడాలను అడ్డుకునేది ఎవరు? అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది.పట్టాదారు పాస్‌బుక్‌లో రెండు ఎకరాలు నమోదు ఉండగా, క్షేత్రస్థాయిలో ఒక ఎకరమే సాగులో ఉండటం... మరో వైపు 40- 50 ఏళ్లుగా నాలుగు ఎకరాలు సాగు చేస్తున్న రైతుకు రికార్డుల్లో సగం భూమి మాత్రమే ఉండటం వంటి సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? దీనిపై స్పష్టమైన కార్యాచరణ అవసరం.అన్నింటికంటే కీలకమైన కంచెలు, సరిహద్దుల భూ వివాదాలు ఎలా పరిష్కరిస్తారు? చిన్నచిన్న నాయకుల జోక్యం, రాజకీయ ఒత్తిళ్లు, అక్రమ జోక్యాలను ఎలా అరికడతారు? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.రీ సర్వే నిజంగా రైతుకు మేలు చేస్తుందా? లేక కొత్త వివాదాలకు నాంది పలుకుతుందా? మేజర్ గ్రామాలు దూరంగా పెట్టిన "తేనెతుట్టె"ను కన్నారం గ్రామం నెత్తిన మోసే పరిస్థితి వస్తుందా? అధికారులు సహనం, మెలకువ, పారదర్శకతతో వ్యవహరించి రైతుల హక్కులకు భంగం కలగకుండా రీ సర్వే నిర్వహించాల్సిన బాధ్యత ఉంది. ఏ చిన్న నిర్లక్ష్యం జరిగినా రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదనే హెచ్చరిక గ్రామంలో బలంగా వినిపిస్తోంది.





# రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల పీఆర్సీ బకాయిలను వెంటనే ఇప్పించాలి

**ఆగస్టు 4న బస్ భవన్ వద్ద జరిగే నిరసనకు తరలి రండి : వుప్పు సమ్మయ్య**




**వాస్తవం, హనుమకొండ, జూలై 30:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నందు పలు శాఖలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన 32 వేల మంది కార్మికులకు రావలసినటువంటి న్యాయమైన పి ఆర్ సి బకాయిలను వెంటనే చెల్లించి.. ఇతర న్యాయమైన సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని టి జి ఎస్ ఆర్ టి సి వరంగల్ రీజియన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వి. సమ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్ సౌకర్యం కల్పించాలని, సూపర్ లగ్జరీ బస్సులలో భా ర్యా భర్తలకు ఉచిత రవాణా సౌకర్యం, వైద్యం, తదితర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ముఖ్య భూమిక పోషించిన ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆవేదనను అర్థం చేసుకొని తమ న్యాయమైన సమస్యలపై స్పందించి యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చి పరిష్కరించవలసిందిగా కోరారు. సమస్యలపై ఆగస్టు 4వ తేదీన బస్ భవన్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి రిటై ర్డ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి పి.ఎల్ నరసింహారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు నరసింహరావు, ముఖ్య ఉపాధ్యక్షులు వెంకటయ్య, సలహాదారు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..**
**అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి**

**వాస్తవం : గోదావరిఖని**

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలోకమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.పెద్దపల్లి మంచిర్యాల జోన్ల లోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.పెద్దపల్లి మంచిర్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని సూచించారు.ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ తరపున అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు పోలీసుల సూచనలు, సలహాలను పాటి స్తూ సహకరించాలని ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని కోరారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు వంకలు కాలువలు నదులు, రిజర్వాయర్లు చెరువుల వద్దకు వెళ్ల రాదు చెట్ల కింద శిథిలావస్థలో ఉన్న భవనాల్లో లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదు. విద్యుత్ స్థంభాలు ట్రాన్స్ ఫార్మర్లు తాకరాదు.ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులు, నాలాలు డ్యామ్‌లు జలపాతాలు (వాటర్ ఫాల్స్) వద్దకు వెళ్లరాదు.చేపల వేట కోసం కూడా వెళ్లకూడదు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలి.స్థానిక రెవెన్యూ నీటిపారుదల పంచాయతీరాజ్ విద్యుత్ ఆర్అండ్‌బీ వైద్య శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న లేదా నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా ఇరు వైపులా బ్యారికేడ్లు,ప్లాస్టిక్ కోన్‌లు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు కుంటలు అలుగులు ప్రధాన రహదారులపై ప్రవహిస్తున్న వాగులు వం కల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోలీసు అధికారులు సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.వరద నీటి కారణంగా చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం గుంతలు ఏర్పడి వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.కాబట్టి నెమ్మదిగా అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.కల్వర్టులు చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలతో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని హెచ్చరించారు.ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు . అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 కు సమాచారం అందించాలని పోలీసు సిబ్బంది 24 గంటల పాటు సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.




# వీర్లపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**బాధితులకు అండగా ఉంటామని భరోసా**



**వాస్తవం, గోదావరిఖని, జులై, 30**

గోదావరిఖనిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆర్ఎఫ్‌సిఎల్ ప్రహరీ గోడ కూలిపోవడంతో వరద నీరు వీర్లపల్లి గ్రామంలోని పలు ఇండ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ నేపథ్యంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లతో కలిసి గురువారం వీర్లపల్లి గ్రామంలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులను అప్రమత్తం చేస్తూ, బాధితులకు అవసరమైన సహాయ చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ భరోసా ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతంగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పోరేటర్లు, నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా మంత్రి వివేక్ వెంకటస్వామి

**ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశం**

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అలుగామ గ్రామానికి చెందిన ఆత్రం మంతయ్య కుటుంబం తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇల్లు కూలిపోవడంతో ఆత్రం మంతయ్య, అతని భార్య లక్ష్మి, కుమారులు అజయ్, అనిల్ గాయపడి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కలిసి గురువారం ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే నిరుపేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎంబరి సజన్ కుమార్కు సూచించారు. దీనికి స్పందించిన సజన్ కుమార్, మంత్రి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి ఇల్లు నిర్మించి అందజేస్తానని తెలిపారు. అనంతరం ఎంబరి సజన్ కుమార్ మా ట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపే దలకు అండగా నిలిచే ప్రభుత్వమని, మంత్రి వివేక్ వెంకటస్వామి ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటారని అన్నారు.అలాగే ఇటీవల భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిన జాడి లింగయ్య కుటుంబానికి కూడా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చినట్లు సజన్ కుమార్ వెల్లడించారు.మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటనలో మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ బ్రహ్మయ్య , సెక్రెటరీ పల్లె సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుర్గం వెంకటస్వామి, ఓల్వోజీ శ్రీనివాస్ ఉన్నారు.






## కాజీపేటకు రైల్వే డివిజన్, కోచ్ ఫ్యాక్టరీలో

# స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కల్పించాలి

**జంతర్ మంతర్ వద్ద బీఆర్ఎస్ ధర్నా**

**వాస్తవం : వరంగల్ ఉమ్మడి జిల్లా :**

బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం శాంతియుత ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నిర్వహించాలని, అందులో 80 శాతం ఉద్యోగాలను స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ సూచనల మేరకు ఈ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కాజీపేట కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేసి, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రకటించాలని కోరారు. కాజీపేట నుంచి క్రూలింక్‌లను తరలించకుండా వరంగల్ లేదా కాజీపేట కేంద్రంగా సెంట్రలైజ్డ్ క్రూ లాబీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బోడగుట్ట వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్లు, స్థానిక ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాలు కల్పించాలని కోరారు. వరంగల్ రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయడంతో పాటు రైల్వే స్టేషన్ల ఎదుట ఆటో అడ్డాల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయవద్దని, ఫాతిమా బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాజీపేట కేంద్రంగా కొత్త రైలు సర్వీసులు ప్రారంభించి, రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని, తెలంగాణ హక్కుల సాధనలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కూడా విఫలమయ్యారని ఆరోపించారు. తెలంగాణ హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాడుతోందని, ఇటీవల కేటీ ఆర్ కేంద్ర రైల్వే మంత్రిని కలిసి తెలం గాణకు రావాల్సిన హక్కులు, నిధులపై వినతిపత్రం సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నార్లగిరి రమేష్, జోరిక రమేష్, సంకు నర్సింగ రావు, బొంగు అశోక్ యాదవ్, పులి రజి నీకాంత్ ముదిరాజ్, పోలపెల్లి రామ్మూ ర్తి, అఫ్జల్, గబ్బేట శీను, నరసింహారావు, దు వ్వ కనకరాజు, కొండ రాజు, పులి విక్ర మ్, బరిగెల వినయ్, పున్నం చందర్, తండమళ్ల వేణు, చుంచు అశోక్, నరేష్, సాధినేని సుధాకర్, దశరథం, రాబర్ట్, వంశీ, గణేష్, చందు, హుస్సేన్, పుల్లయ్య పాల్గొన్నారు.



## కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో

## వికసిత్ భారత్ ఉద్యోగుల నిరసన



**వాస్తవం: భూపాలపల్లి**

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ గ్రామీణ్ మిషన్ ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. తమకు పే స్కేల్‌ను ఆగస్టు 15లోపు అమలు చేయాలని, ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్ఆర్డీఎస్ బోర్డు నిర్ణయాలను అమలు చేయడంతో పాటు, సెలవు దినాల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులకు తగిన ప్రయోజనాలు కల్పించాలని, వేతనాల జాప్యానికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా క్యాడర్ వ్యవస్థ, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్మెంట్ పాలసీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జాక్ చైర్మన్ జమీర్ భాష, ఏపీఓల ప్రెసిడెంట్ కుమారస్వామి, ఈసీలు దుబాసి విటల్, మంగీలాల్, నితిన్, టెక్నికల్ అసిస్టెంట్స్ ప్రెసిడెంట్ దాసిరాజు, సీఓ సంఘం ప్రతినిధులు రాజేందర్, కుమారస్వామి, మధుకర్, రేణుక, శ్రావణ్ కుమార్, ఎం. రాజుతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి

**రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రుల పూజలు**

**స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే**

**వాస్తవం : వేములవాడ**

సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురు వాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కె టింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాం క్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా గురువారం వేములవాడకు చేరుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మంత్రులకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి.. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు సత్వర సద్యఃసువృష్టి కోసం ఋశ్య శృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, వరుణయాగం అనేది కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు.





సమృద్ధిగా వర్షాలు కురిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు రాష్ట్రం వ్యవసాయరంగంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీరడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్ రమాదేవి, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ డిఓ కెఎస్ బి కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

### క్రైమ్ ఏసిపి సదయ్య



**వాస్తవం, వరంగల్ క్రైమ్, జూలై 30:**

మహిళల ఫిర్యాదులను అత్యంత సున్నితంగా, గౌరవప్రదంగా స్వీకరించి, వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని, మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్య లు తీసుకోవాలని క్రైమ్స్ ఏసిపి సదయ్య ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రంగంపేట మహిళా పోలీస్ స్టేషన్--2ను వార్షిక తనిఖీల్లో భాగంగా క్రైమ్స్ ఏసీపీ సదయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, బాధిత మహిళలకు అందిస్తున్న సేవలు, పెండింగ్ కేసులు, ప్రస్తుత దర్యాప్తులో వున్న కేసులు, నిందితుల అరెస్ట్, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బాధిత మహిళలకు భరోసా కల్పిస్తూ వారికి అవసరమైన సహాయం అందించాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి మహిళతో మర్యాదపూర్వకంగా, సహానుభూతితో వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, పరిశుభ్రత, క్రమశిక్షణ పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని పేర్కొన్నారు. తనిఖీలో మహిళా పోలీస్ స్టేషన్--2 ఇన్‌స్పెక్టర్ సువర్ణతో పాటు , ఎస్.ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహాలక్ష్మితో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

**రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**

**వేములవాడ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు మంత్రులు శంకుస్థాపన**

**కోరుట్ల మీదుగా బాసరకు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం**

**వాస్తవం : వేములవాడ**

మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పక్కాగా అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ--కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు సిబ్బంది నియామకాలు కూడా చేపడుతున్నామని వెల్లడించారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ. 1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు రోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించామని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. రోజుకు 50 వేల మంది వేములవాడ బస్ స్టేషన్ నుంచి ప్రయాణం చేస్తున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి రూ. 11,668 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. 2600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 కోట్లతో బస్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగుల దాదాపు రూ.1000 కోట్ల పీఎఫ్ బకాయిలు, 600 కోట్ల సీసీఎస్ బకాయిలు చెల్లించామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.... రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా తెలంగాణ ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజ లకు చేరుతున్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వరుణ పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచిం చారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర సమ యంలో ఇచ్చిన హామీ మేరకు వేముల వాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదే అభివృద్ధి దిశగా వేముల వాడ తిప్పా పూర్ బస్‌స్టేషన్ ఆధు నీకర ణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమ న్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టే షన్ ఆధునీకరణకు రూ. 1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభా కర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులకు ఈ ఆధునీకరించిన బస్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## మనిషి అక్రమ రవాణాను అడ్డుకుందాం



**వాస్తవం : వరంగల్ ప్రతినిధి: జూలై 30**

మానవ అక్రమ రవాణా ఒక తీవ్రమైన నేరమని, దీనిని అరికట్టడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో "స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్" ఆధ్వర్యంలో, ప్రపంచ మానవ(బాలల) అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం – జూలై 30" సందర్భంగా బాల బాలికలకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది పురుషులు, మహిళలు , పిల్లలను లాభాపేక్ష కోసం ఉపయోగించే విస్తృత నేరమని అన్నారు. "మనిషి వ్యాపార వస్తువు కాదు. స్వేచ్ఛగా జీవించే ప్రాణి. దోపిడీ, బెదిరింపులు, బలవంతం, అపహరణ, మోసం, రవాణా, ఆశ్రయం ఇవ్వడం, బదిలీ చేయడం వంటివన్నీ అక్రమ రవాణా కిందకే వస్తాయి. ఇందులో పాల్గొనే వ్యక్తులు చట్టప్రకారం జీవితకాల జైలు శిక్షకు అర్హులు" అని విద్యా ర్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కాంతారావు మాట్లా డుతూ.. ఆడపిల్లలు అక్రమ రవాణాకు గురికాకుండా సక్రమ మార్గంలో పయనించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల ప్రలోభాలకు లొంగకుండా నిరంతరం అప్రమత్తం గా ఉండాలని, ఎవరిపైనైనా అనుమానం వస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ – 1098 మరియు పోలీస్ – 100 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి రక్షణ పొందాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు అక్రమ రవాణా గురించి తెలియజేసే వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామి, పీఇటి స్వామి, పాఠశాల ఉపాధ్యాయులు, బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తం చేయాలి

**రిజర్వాయర్లలో నీటిని తాగునీటికి వినియోగించాలి**

**రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి**

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి**

**జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవ సాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. సూపర్ ఎల్ నినోపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారంవివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కునేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన పీపీటిని ప్రదర్శించారు. జిల్లా ఎల్ నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.జిల్లా పరిధిలోని ఎన్ని రిజర్వాయర్లు ఉన్నా యి? వాటిలో నీటిమట్టం? జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు? మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా? విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ....సూపర్ ఎల్ నినో ప్రభావం దక్షిణ భారత దేశంపై ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని వివరించారు. ఇప్పుడు రిజర్వాయర్లలో ఉన్న నీరు తాగునీటికి మాత్రమే వచ్చే ఏడాది జూలై వరకు వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.రెండు రోజుల్లో కురిసిన వర్షం పంటలకు కొంత మేలు చేస్తుందని, కానీ పంట పూర్తిగా చేతికి వచ్చే వరకు ఉపయోగ పడదని తెలిపారు.గత రెండు నెలలు సరిగా వర్షాలు సరిగా కురవక పంటల సాగు గణనీయంగా తగ్గిందని, వచ్చే నెలలో ఏ పంటలు సాగు చేస్తే మేలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరుతడి, స్వల్ప కాలిక పంటలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా వివరించాలని పేర్కొన్నారు. వాటికి కావలసిన అన్ని విత్తనాలు అందుబాటులో పెట్టాలని సూచించారు. మంచి ప్రణాళిక ప్రకారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. గత ఏడాదితో పోలిస్తే భూ గర్భ జలాలు రెండు మీట ర్లకుపైగా లోతులోకి వెళ్ళాయని వెల్లడించారు. జిల్లాలోని అన్ని రిజర్వాయర్లలోని నీరు పంటలకు విడుదల చేసే అవకాశం లేదని, భూ గర్భ జలాల సమాచారం అధికారులు ప్రజలు, రైతులకు ఎప్పటికప్పుడు తెలియజే యాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని మంత్రి ఆదేశించారు.తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్స్ రీచార్జ్ పనులు, పామ్ పాండ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా చేయించాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. జిల్లాలోని మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని, రిజర్వాయర్ల నీటిని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పంపింగ్ కోసం కావాల్సిన మోటర్లు అదనంగా సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు.నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్ డిఓ కె ఎస్ బి కుమారి, డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.








# 2034 వరకూ నేనే సీఎం

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయం**

**ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది**

**ఓట్లు, రాజకీయాలు నాకు ముఖ్యం కాదు**

**విద్యార్థుల కోసం ఎంత ఖర్చయిన ప్రభుత్వం భరిస్తుంది**

**హైదరాబాద్, జులై 30 :** విద్యావ్యవస్థ రాష్ట్రంలో బలపడిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యావ్యవస్థ ఉండాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఎంసీహెచ్ ఆర్డీలో ఫిన్‌లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 'టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్‌చేంజ్' కార్యక్రమంలో భాగంగా ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఉపాధ్యాయుల బృందం పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. జవాహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు వేసిన పునాదులతో ఇప్పుడు మన దేశంలో లైఫ్‌స్పాన్ పెరిగిం దని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇక్కడి పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలని చెప్పారు. విద్యలో నాణ్యత పెరగాలని, పిల్లలకు పౌష్టికాహారం అందాలని సూచించారు. తెలంగాణలో తనకు తెలిసిన మేధావులు ఇద్దరేనని.. వారిలో కేకే, జైపాల్‌రెడ్డి అని అభివర్ణించారు. విద్య విషయంలో బాధ్యత తీసుకోవాలని కేకేను అడిగానని చెప్పుకొచ్చారు. ఆయన సలహాదారుగా అనేక సూచనలు చేస్తున్నారని తెలిపారు. వెనకబాటుతనానికి కారణం చదువులేకపోవడమేనని చెప్పుకొచ్చారు. చదువుకున్న ఎస్సీలు సమాజంలో మంచి స్థానంలో ఉన్నారని వివరించారు. ఆస్తులున్నా.. చదువు లేకపోతే సమాజంలో వెనకపడిపోతున్నారని వెల్లడించారు. విద్యార్థులను సమాజంలో గొప్పగా నిలబెట్టగలిగిన శక్తి ఉపాధ్యాయులకు ఉందని కొనియాడారు. ప్రతీ విద్యార్థిపై రూ.1,08,000 ఖర్చు తాము చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.పీవీ నర్సింహారావు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వేల్‌లో ఆ స్కూల్లోనే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు చదువుకున్నారని ప్రస్తావించారు. నవోదయకు స్ఫూర్తి సర్వేల్ గురుకులమని చెప్పుకొచ్చారు. ప్రపంచంతో పోటీ పడాలంటే ఈ విద్యా నాణ్యత సరిపోదని అభిప్రాయపడ్డారు. ప్రపంచం ఇంకా మెరుగైన నాణ్యమైన విద్య ఆశిస్తుందని తెలిపారు. నేర్చుకోవడమే కాదని.. నేర్చుకున్న వాళ్లతో ఇక్కడి విద్యార్థులు పోటీ పడాలని అన్నారు. జర్మన్, జపాన్, సౌత్ కొరియా, చైనా లాంటి దేశలతో ఇక్కడి విద్యార్థులు పోటీ పడాలని సూచించారు. బదిలీలు, ప్రమోషన్లు అన్నీ అడగకుండానే తాము ఇచ్చామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల సమస్యలు తనకు వదిలేయాలని అన్నారు. వారి సమస్యలను తాను పరిష్కరిస్తానని మాటిచ్చారు. 2023 వరకు ఒకటో తేదీనే జీతాలు పడ్డాయా? అని ప్రశ్నించారు. ఈ మూడేళ్లు తెలంగాణను సక్రమంగానే నడిపించానని స్పష్టం చేశారు. ఎక్కడా ఆగం కాలేదని.. కలగాపులగం చేయలేదని తెలిపారు. ప్రతి విద్యార్థిపై రూ.1,08,000 ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. 2014-23 మధ్య డ్రాపౌట్స్ పెరిగాయని వివరించారు. 2023-26 వరకు డ్రాపౌట్స్ తగ్గి అడ్మిషన్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. విద్యాశాఖలో తాము తెచ్చిన సంస్కరణలే ఇందుకు కారణమని వెల్లడించారు. క్రమశిక్షణ లేకపోతే ఎంత తెలివి ఉన్నా పనికిరారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# సింగరేణి స్థలంలో అక్రమ నిర్మాణాలు నేలమట్టం



**వాస్తవం, గోదావరిఖని, జులై 30:**

సింగరేణి రామగుండం ఏరియా-1 పరిధిలోని గోదావరిఖని తిలక్ నగర్ చౌరస్తా పరిసర ప్రాంతంలో సింగరేణి భూమిలో జరుగుతున్న అక్రమ ప్రైవేట్ నిర్మాణాలను సింగరేణి స్పెషల్ స్క్వాడ్ బృందం పర్యవేక్షణలో గురువారం నేలమట్టం చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ...సింగరేణి భూముల్లో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు (ప్రైవేట్ నిర్మాణాలు) చేపట్టడం చట్టవిరుద్ధమని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా సింగరేణి భూమిలో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిర్మాణాలను వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. అధికారుల చర్యను స్థానికులు, అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారని వారు తెలిపారు. ప్రభుత్వ, సింగరేణి భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు ఇలాంటి ప్రత్యేక చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**-రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసిన.. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**వాస్తవం : వరంగల్ ప్రతినిధి: జూలై 30**

రైతులకు అన్ని విధాలుగా అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.గురువారం పర్వతగిరి మండల కేంద్రంలోని రిజర్వాయర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, రిజర్వాయర్ నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలువకు నీరు రావడంతో రైతులకు వ్యవసాయానికి ఎంతో దోహదపడుతుందని పర్వతగిరి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుందని ఎల్-నీనో ప్రభావం ఉన్నప్పటికీ రైతుల బాధలు అర్థం చేసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేస్తు న్నామని తెలిపారు. స్థానికంగా కొంతమంది ప్రతిపక్ష నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. "రైతులకు సహాయం చేయలేని దద్దమ్మలు నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సరైన రీతిలో బుద్ధి చెప్తాం. రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమే" అని స్పష్టం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డును సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధ్య క్షురాలు సావిత్రి, సర్పంచ్ శంకర్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రావు, గ్రామ శాఖ అధ్యక్షులు రాంచందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, సీనియర్ నాయకులు సంపత్, ఇరిగేషన్ అధికారులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
Cell No - 8074124190 Editor : MANASANI KRISHNA REDDY

# మంచిర్యాలలో రియల్ బురిడీ?

**కలం కావలి జనాలకా? రియల్ దందాలకా?**
**ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారం సక్రమమేనా?**
**సక్రమమైతే మీడియా సంస్థలకు డబ్బులు వెదజల్లడం ఎందుకు?**
**ప్రశ్నించినవారిపైన కేసులు పెడితే అక్రమం సక్రమం అవుతుందా?**
**రియల్ సంస్థని డబ్బుల కోసం వేధించిన పాత్రికేయులు**
**ముగ్గురి మీద హడావిడిగా ఫిర్యాదు చేయడంలోని మర్మం ఏంటి?**
**ఈ రియల్ దందాకు కావలిగా ఉన్న సిండికేట్ బ్రోకర్ జర్నలిస్టులు**



**ప్రజలకు**,ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్యానికి కావలిగా ఉండాల్సిన మీడియా కొందరు అక్రమార్కులకు కావలిగా ఉంటోందనే విమర్శలు వస్తున్నాయి.ఇసుక అక్రమ రవాణా,బూడిద దందా,కొలువుల మాఫియా,బొగ్గు చోరీ ఇలా చెప్పుకుంటూపోతే కాదేది అక్రమాలకు అనర్హం అన్నట్లు ప్రతీ చీకటి దందాకు కొందరు మీడియా సిండికేట్‌గాళ్లు కావలిగా ఉంటున్నారన్నది యథార్థం.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకొస్తే ప్రభుత్వాలు తమ తప్పులను సరిచేసుకునే అవకాశం కల్పించడానికి గొప్ప వారధులుగా పత్రికా విలేకర్లు ఉంటారు.ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లలో కదలిక తేగలుగుతుంది అన్న కాళోజీ మాటలు అక్షర సత్యం. అర్హులైన వృద్ధులకు పింఛన్ అందడం లేదనో ఉండటానికి గుడిసె కూడా లేని పేదలనో ఇలా అనేక సమస్యలను ప్రత్య క్షంగా చూసిన విలేకర్లు చిన్న ఫొటో వార్త రాసినా పాలకులు, అధికారులు స్పందించి తక్షణ పరిష్కారాన్ని చూపేవారు.ఇలా తాము చూసిన ప్రజా సమస్యలను, అక్రమాలను, అన్యాయాలను, పాలకుల తప్పులను,అధికారుల నిర్లక్ష్యాలను అక్షరీకరించడానికి పత్రికా విలేకర్లు ఏ ప్రతిఫలం ఆశించరు.అయితే ఇదంతా గత పాత్రికేయ గౌరవం.ఇసుక అక్రమంగా తేడేసినా, బూడిద దందాతో కోట్ల రూపాయలు కొల్లగొట్టినా,రియల్ ఎస్టేట్ మోసాలతో జనాలను బురిడీ కొట్టించినా,పేదలకు ఇండ్ల జాగలు లేకున్నా, అర్హులైన వృద్ధులు పింఛన్లు అందక నానా అగచాట్లు పడుతున్నా... ఇవేవి పట్టనిదే నేటి జర్నలిజం దౌర్భాగ్యం. పైగా ఈ అక్రమాలను,లూటీలను వెలుగులోకి రాకుండా కప్పిపెట్టడానికి అక్షరాలను అమ్ముకోవాల్సిందే.వాస్తవానికి గత పదేండ్ల నుంచి మీడియా మీద అనేక ఆరోపణలు వస్తున్నాయి.మీడియాలు ప్రజల కోసం పనిచేయడం లేదని,వాటిని ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రయోజనాల కోసమే మీడియాలు పనిచేస్తున్నాయని,ఇలాంటి మీడియాల్లో పనిచేసే కొందరు విలేకర్లు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను అక్షరీకరించకుండా అక్రమాలను కప్పిపెట్టడానికి అమ్ముడుపోతున్నారనే విమర్శలు నలువైపుల నుంచి విన్పిస్తున్నాయి.ఈ విమర్శల్లో పూర్తిగా నిజం లేకపోవచ్చు.అయితే ఎంతో కొంత ఈ ఆరోపణల్లో వాస్తవం ఉంది.ఇప్పటికీ నిజాయితీగా, నిఖార్సుగా పనిచేసే పాత్రికేయులు అనేక మంది ఉన్నారు.అయితే కేవలం ధనార్జనే ధ్యేయంగా పవిత్రమైన పాత్రికేయ వృత్తిలోకి జర్నలిజం ముసుగేసుకుని వస్తున్న కొందరు నాన్‌జర్నలిస్టులు జరుగుతున్న ప్రతీ అక్రమాలని కప్పిపెట్టడానికి ఓ రేటు లెక్కన తీసుకుంటున్న విషయం క్షేత్రస్థాయిలో ఉన్న పచ్చి నిజం. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా పారిశ్రామిక ప్రాంతంలో బూడిద దందా విషయాన్ని బయట ప్రపంచానికి తెలియకుండా ఉండటానికి అక్కడి మీడియా ప్రతినిధులు అనేక మంది బూడిద దందా నిర్వాహకుల నుంచి డబ్బులు తీసుకున్నారు.ఏ మీడియాకు ఎంత ఇచ్చారు? అనేది లిస్టు ప్రకారం అక్కడి మీడియాల ప్రతినిధులు కొందరికి మామూళ్లు ముట్టిన విషయం బహిరంగ విషయమే.ఈ మామూళ్ల పంపకాల విషయంలో అక్కడి మీడియా ప్రతినిధులు కొట్టుకున్న విషయం కూడా అందరికి తెల్సిందే.అదేవిధంగా అక్కడ ఎన్టీపీసీకి విద్యుత్ కేంద్రానికి సరఫరా అయ్యే బొగ్గును దొంగిలించి లక్షలాది రూపాయలు కొల్లగొట్టిన బొగ్గు మాఫియా విషయం బయటకు రాకుండా ఉండటానికి కొందరు మీడియా ప్రతినిధులకు నెలనెలా మామూళ్లు ముట్టిన విషయం కూడా తెల్సిందే.అలాగే ఆర్ఎఫ్‌సీఎల్ కొలువుల దందాలో ఉద్యోగాలు పెట్టిస్తామని నిరుద్యోగుల ఒక్కొక్కరి దగ్గర నుంచి ఆరు లక్షల నుంచి 13 లక్షల వరకు డబ్బులు దండుకున్న వ్యవహారంలో మధ్యవర్తిగా ఉన్నది కూడా ప్రముఖ మీడియా విలేకరే.తమ కొలువులు పోయాయని,తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చేయండని బాధితులు బలవన్మారణాలకు పాల్పడిన విషయం అందరికీ తెల్సిందే. ఇలా బలవన్మరణాలకు పాల్పడే సందర్భంలో ఎవరికి ఎంత ఇచ్చామో ఈ విషయం విలేకరికి పూర్తిగా తెలుసునని ఆయనే మధ్యవర్తిగా ఉన్నారని రాసిన విషయం కూడా విదితమే.ఇలా చెప్పుకుంటూపోతే ఒకటా రెండా...కలం మాటున బ్రోకర్ పనులు చేస్తున్న జర్నలిజం ముసుగు వేసుకున్న కొంత మంది చరిత్రలు అనేకం ఉన్నాయి.తాజాగా మంచిర్యాల జిల్లాలో ఓ ఘటన చోటుచేసుకుంది. ఆ జిల్లాలో ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థపైన వివిధ రకాల మోసాలకు పాల్పడ్డారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయి.కొన్ని పత్రికల్లో కథనాలు కూడా ఇటీవల ప్రచురితం అయ్యాయి. వ్యవసాయ భూములను ఫాం ల్యాండ్ పేరుతో అమ్ముతూ..మోసాలకు పాల్పడుతున్నారని, శ్రీగంధం మొక్కలను పెంచి మీకు అధిక లాభాలు వచ్చేలా చేస్తామంటూ జనాలను బురిడీ కొట్టిస్తూన్నారంటూ అనేక ఆరోపణలు వస్తున్నాయి.ఈ విషయంలో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా.. వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో అమ్మవచ్చా? అధిక లాభాలు చూపించి జనాలను మోసం చేయవచ్చా? ఫాం ల్యాండ్స్ అమ్మాలంటే చట్టాలు ఏం చెబుతున్నాయి. వెంచర్లు వేసి కస్టమర్లకు చేస్తున్న రిజిస్ట్రేషన్లలో ఉన్న లొసుగొలు ఏంటి? త్వరలోనే ఈ సంస్థ భారీ కుంభకోణం వెలుగులోకి రాబోతోందా? ఇలా అనేక ప్రశ్నలతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వస్తున్నాయి. ఈ విషయంపైన సదరు రియల్ సంస్థ స్పందించి ఆ వార్తలన్నీ తప్పు..ఇలా ప్రచారం చేసేవారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.అయినా ఈ సంస్థపైన సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతోపాటు పత్రికల్లో కథనాలు వస్తున్నాయి.వాస్తవానికి మంచిర్యాల జిల్లాలో ఉన్న ఆ ప్రముఖ రియల్ సంస్థ పైన అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ప్రభుత్వం సీరియస్‌గా విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిజంగా ఈ సంస్థ రియల్ మోసాలకు పాల్పడుతోందా? లేక నిజాయితీగా,చట్ట బద్దంగా వ్యాపారం చేస్తోందా? అని నిజాన్ని నిగ్గు తేల్చాలి.ఇప్పటికే ఈ సంస్థ చేసిన వెంచర్లలో అధికారులు భారీస్థాయిలో డబ్బులు తీసుకుని అనేక అక్రమ రిజిస్ట్రేషన్లకు తెరతీశారని ఆరోపణలున్నాయి.నిజానికి ఈ సంస్థ తమ లోపాలను బయటకి రాకుండా ఉండటానికి దాదాపు 150 నుంచి 200 మీడియా ప్రతినిధులను ప్రతీ సంవత్సరం రూ.10 వేల నుంచి 20 వేల వరకు ప్రకటనల రూపంలో డబ్బులు ఇస్తారనే ప్రచారం ఉంది.ప్రకటనలు ఇవ్వకపోతే వార్తలు రాస్తే దిగొచ్చిన యాజమాన్యం సదరు పత్రికా విలేకరికి డబ్బులు ఇస్తారనే వార్తలు కూడా ఉన్నాయి.తాజాగా ఓ పత్రిక విలేకరి ఈ సంస్థపైన ఒక వార్త తమ పత్రికలో రాయడంతో ఆ సంస్థ యజమాని సదరు పత్రికా విలేకరితో బేరసారాలు ఆడినట్లుగా తాజాగా పోలీసులకు సదరు సంస్థ యజమాని ఇచ్చిన ఫిర్యాదులోనే అంగీకరించడం విశేషం. మా సంస్థ మీద వార్తలు రాస్తున్నారని,అలా రాయకుండా ఉండటానికి రూ.3 లక్షల రూపాయలు ఇస్తామని అంగీకరించామని, ఇందుకుగాను రూ.50 వేల రూపాయలు సదరు పత్రికా విలేకరికి ఇచ్చామని ఆ రియల్ సంస్థ అధిపతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. తాము నిజాయితీగా ఎవరినీ మోసం చేయకుండా,చట్టబద్ధంగా వ్యాపారం చేసేప్పుడు ఇలా విలేకర్లకు తమ మీద రాయరాదంటూ ఎందుకు డబ్బులు ఇవ్వాల్సి వచ్చింది. ప్రతీ సంవత్సరం లక్షల్లో మీడియాలకు డబ్బులు పంచిపెడుతన్నారు? అనే ప్రశ్నలు ఉన్నాయి.సమాజంలో జరిగే లోపాలు,అవినీతి,అక్రమాలను వెలుగులోకి తీసుకురావడమే పత్రికల బాధ్యత.అలాగని చేతిలో కలం ఉందని ఏది పడితే అది రాయడానికి అవకాశం లేదు. నిరూపితం కాని ఆరోపణలు రాసే సందర్భంలో చట్టప్రకారం చర్యలకు బాధ్యులు కావాల్సిందే.మరి అలాంటి అవకాశం ఉన్నప్పుడు తమ సంస్థ మీద తప్పుడు కథనాలు రాస్తున్న విలేకర్లకు భయపడి బేరసారాలు చేయడం ఎందుకు? వారికి భయపడటం ఎందుకు? తప్పుడు వార్తలు ప్రచురిస్తే పత్రికల మీద పరువు నష్టం దావాలు వేయవచ్చు కదా? అలాకాకుండా చీకట్లో సదరు పత్రికా విలేకరికి రూ.50 వేలు ఇచ్చానని అంగీకరిస్తున్నారంటే ఖచ్చితంగా ఈ సంస్థ వ్యాపారంలో జనాలని మోసం చేస్తున్న విషయం ఉందన్నమాట. ఈ విషయాన్ని దాచేయడానికో లేదో కప్పిపెట్టడానికో ఇలా మీడియాలకు డబ్బుల బొక్కలు విసిరేయడం, జర్నలిజం ముసుగేసుకున్న కొందరు బ్రోకర్‌లను ఇలాంటి రాయబేరాలు జరపడానికి నియమించుకుని వారిని మేపడం వంటి పనులకు పాల్పడుతున్నారంటే ఈ సంస్థ జనాలని బురిడీ కొట్టించే రియల్ దందాలకు పాల్పడుతుందనేది స్పష్టం అవుతోంది.ఎవరైనా ఈ సంస్థని ప్రశ్నిస్తే వెంటనే ప్రజలకు కావలిగా ఉండాల్సిన మీడియాలు ఈ రియల్ వ్యాపారులకు కావలిగా ఉంటున్నారంటే ఆశ్చర్యంగా ఉంది.ఎందుకంటే పైన చెప్పినట్లు ప్రతీ సంవత్సరం ఈ సంస్థ నుంచి అందుతున్న మామూళ్ల కోసం.అయితే ఈ సంస్థ ఒక్కదాని గురించే మాట్లాడటం భావ్యం కాదుకావచ్చు.ఎందుకంటే ఇలా దాదాపు ప్రతీ చీకటి వ్యాపారంలో,ప్రతీ అక్రమ దందాలో ఉండే వ్యవహారమే.ఇప్పుడు ఈ సంస్థ మీద తప్పుడు ప్రచారం చేస్తూ వార్తలు ప్రచురితం చేస్తున్న కొన్ని పత్రికల విలేకర్ల మీద ఒక్కరోజు క్రితం ఆ సంస్థ అధిపతి పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో ఇద్దరు విలేకర్లు,ఒక సోషల్ మీడియా కార్యకర్త మీద వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు.డబ్బుల కోసం తమని బెదిరించారని,తమ మీద వార్తలు రాయరాదని ఇందుకు రూ.3 లక్షలు ఇస్తామని అందుకు మొదటగా రూ.50 వేల రూపాయలు ఇచ్చామని,మిగతా డబ్బుల కోసం వేధిస్తున్నారని సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ రియల్ ఎస్టేట్ వ్యవహారాలపైన చాలామంది తరచుగా మండల ఎమ్మార్వోలకు ఫిర్యాదు చేస్తుండటం సహజమే.. ఇచ్చిన ఫిర్యాదులను డబ్బులు తీసుకుని వెనక్కి తీసుకోవడం కూడా సహజమే.అదేవిధంగా తమ పత్రికల్లో వార్తలు రాస్తామని బెదిరించే వారు కూడా అధికమే..వార్తలు రాసో లేక రాయకుండానే డబ్బులు అడుక్కునే వారు కూడా ఎక్కువే.ఇదంతా గత కొన్నేండ్లుగా జరుగుతున్న తంతే.అయితే ఇప్పుడు తాజా వ్యవహారంలో ఓ సామాజిక మాధ్యమాల కార్యకర్త ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారంపైన అనేక ప్రశ్నలతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.ఈ పోస్టులపైన సదరు రియల్ ఎస్టేట్ అధిపతికి ఈ సామాజిక కార్యకర్త మధ్య కొన్ని ఫోన్ సంభాషణలు, బేరసారాలు,బుజ్జగింపులు జరిగాయి.ఈ క్రమంలో కొంత అమౌంట్ తనకు అవసరం ఉందని అది ఇవ్వండి అంటూ సదరు సామాజిక మాధ్యమాల కార్యకర్త ఈ రియల్ వ్యాపారితో సంభాషించిన విషయం నిజమే.అయితే తమ బంధువులకు క్యాన్సర్ సోకిందని,ఈ విషయంలో మీరేమైనా సాయం చేయండంటూ సదరు సామాజిక మాధ్యమాల కార్యకర్త సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారిని అడిగినట్లుగా సమాచారం.అయితే ఈ సామాజిక మాధ్యమాల కార్యకర్త రియల్ ఎస్టేట్ సంస్థకు వ్యతిరేకంగా చేస్తున్న పోస్టులను ఆధారం చేసుకుని ఓ పత్రిక విలేకరి రియల్ మోసాలంటూ ఓ కథనం తన పత్రికలో ప్రచురితం చేశారు. ఈ కథనం ప్రచురితం అయిన తర్వాత సదరు పత్రికా విలేకరి సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారితో సయోధ్య కుదుర్చుకుని తమ పత్రికలో ప్రకటన తీసుకున్నారని అంటున్నారు.ఈ క్రమంలో మరో విలేకరి కూడా తమ స్వంత పత్రికలో ఈ రియల్ ఎస్టేట్ వ్యవహారంపైన కథనం రాశారు.మరి ఆ విలేకరి ఈ సంస్థతో బేరసారాలు ఆడారో లేదో తెలియదు.అయితే బేరం కుదిరినాక ఉన్నట్లు ఉండి ఈ సంస్థ పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఇలా తమ మీద వార్తలు రాయడం,వారిని డబ్బులతో కట్టిపడేయడం ఇవన్నీ ఈ సంస్థకు సాధారణమే.అయితే ఇప్పుడు ఈ వ్యవహారంలో బేరాలు కుదిరినా,కొంత డబ్బు ముట్టచెప్పినా ఉన్నట్లు ఉండి ముగ్గురిపైన ఫిర్యాదు చేయడం ఏంటి? కేసు నమోదు అయ్యేలా చేయడం వెనక ఉన్న మర్మం ఏంటి? వాస్తవానికి ఈ రియల్ సంస్థ వ్యవహారంపైన ఆరోపణలు మెల్లిమెల్లిగా ఉధృతమవుతున్నాయి.వస్తున్న ఆరోపణలకు సరియైన సమాధానం ఇవ్వకుండా ఎవరైనా మాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే కేసులు పెడతాం అంటూ బెదిరించడం వంటి చర్యలకు పూనుకోవడంపైన హైదరాబాద్‌లో ఉన్న చాలామంది పాత్రికేయులు ఈ విషయం మీద దృష్టి నిలిపారు.అసలు ఈ సంస్థ చేస్తున్న వ్యాపారంలో నిజానిజాల సంగతి ఏంటి? నిజంగా బయట వస్తున్న ఆరోపణల ప్రకారం ఈ సంస్థ భారీ కుంభకోణానికి పాల్పడిందా? త్వరలోనే బోర్డు తిప్పేయబోతోందా? జనాలు అడ్డగోలుగా మోసపోబోతున్నారా? అనే విషయాల మీద జరుగుతున్న ప్రచారంపైన చాలామంది మీడియా ప్రతినిధులు నజర్ వేసినట్లుగా తెలుస్తోంది. కొందరు సీనియర్ పాత్రికేయులు ఇప్పటికే ఈ సంస్థ వ్యవహారాలపైన క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నట్లుగా సమాచారం.అంతెందుకు గత కొద్దిరోజులుగా ఈ సంస్థపైన జరుగుతున్న ప్రచారంలో నిజానిజాలపైన 'కే.ఆర్ ఉన్నమాట' శీర్షికలో వాస్తవాలను,మోసాలను ప్రజలకు వివరించాలని నేను కూడా క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేస్తున్నాం. వివరాలను సేకరిస్తున్నా . వాస్తవానికి సంస్థ నిజాయితీగా చట్టబద్దంగా వ్యాపారం చేస్తుంటే ఆ విషయం ప్రజలకు తెలియాలి. ఎందుకంటే ఎంతో కష్టపడి నిర్మించుకున్న వ్యాపారాన్ని తప్పుడు ప్రచారంతో దెబ్బతీయడం నిజమైన జర్నలిజం కానేకాదు.అలాగే చట్ట వ్యతిరేకంగా వ్యాపారం చేస్తూ వేలాదిమందిని అధిక లాభాల ఆశతో బురిడీ కొట్టించి బోర్డు తిప్పేస్తే ఏమీ తెలియనట్లుగా ఉండటం కూడా నిజమైన జర్నలిజం కానేకాదు.దీంతో ఈ వ్యవహారం ముదురుతోందని గమనించిన సదరు రియల్ సంస్థ ఇక ఈ వ్యవహారంలో ఎవరైనా ప్రశ్నిస్తే కేసులతో ఇరికిస్తామనే సంకేతాలను,హెచ్చరికలను జారీ చేసినట్లుగా అర్థమవుతోంది.

...................

## జర్నలిస్తుల మీద కేసులు పెడితే అక్రమం సక్రమైనట్లేనా?

తమ రియల్ వ్యాపారం మీద డబ్బుల కోసం తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారంటూ మంచిర్యాల రియల్ వ్యాపార సంస్థ ఇచ్చిన ఫిర్యాదుతో ముగ్గురిపైన కేసు నమోదు అయింది.అక్రమ పద్ధతుల్లో డబ్బులు డిమాండ్ చేయడం,బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యలకు ఎవరు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే.లభించిన ఆధారాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేస్తారు? అయితే ఇటీవల జర్నలిస్టుల మీద నమోదవుతున్న కేసుల్లో సరియైన సాక్ష్యాలు లేకుండానే నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కేవలం రూ.వెయ్యి రూపాయలు డిమాండ్ చేశారంటూ విలేకర్లపైన కేసులు నమోదు చేసి జైళ్లకు పంపిస్తున్న ఉందంతాలు ఎన్నో ఉన్నాయి.డబ్బులు అడిగినట్లు మీ వద్ద ఏం ఆధారాలు ఉన్నాయి..ఎందుకు కేసు నమోదు చేశారని పోలీసులను ప్రశ్నిస్తే ఆధారాలన్నీ కోర్టుకు సమర్పిస్తాం..అంటూ పోలీసులు సమాధానాలు ఇస్తున్నారు.మేం బురద పూస్తాం..ఆ బురదని మీరు కోర్టులోనే కడుక్కోండనే వ్యవహారంలా ఇది ఉంది. నిజాలు రాస్తున్న పాత్రికేయుల మీద కేసులతో ఇబ్బందిపెట్టాలని చూడం ప్రజాస్వామ్యానికి మంచి పరిణామంకాదు.తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న విలేకర్లను నయానో భయానో లొంగదీసుకోవాలని చూస్తున్న క్రమంలో మాట వినని వారిని అక్రమ కేసులతో ఇరికించడం పరిపాటే.ఇలా సాటి విలేకర్లపైనే కేసులు పెట్టించడానికి వెనక ఉండి ప్రధాన పాత్ర పోషిస్తున్నది కూడా తోటి విలేకర్లేనని చెప్పడానికి సిగ్గుగా ఉంది.చీకటి వ్యాపారాలకు,అక్రమ దందాలకు కావలిగా ఉంటూ ఓ సిండికేట్‌గా ఏర్పడి మొత్తం పాత్రికేయులను తమ గుప్పిట్లో ఉంచుకోవాలని చూసే గుంటనక్కలు కొన్ని తయారయ్యాయి.ఈ గుంట నక్కలు జర్నలిజం ముసుగేసుకుని ప్రజలకు కావలిగా ఉండకుండా, ప్రజలను దోచుకునే దగుల్బాజీలకు కావలిగా ఉంటూ వారు వేసే ఎంగిలి మెతుకులను తింటూ నీచమైన బతుకులు బతుకుతున్న విషయం అందరికీ తెల్సిందే. ప్రతీ జర్నలిస్టు మీద నమోదవుతున్న ప్రతీ కేసులో సాటి పాత్రికేయులే ఉంటున్నారు.తమ మాట వినని,తమ సిండికేట్ చీకటి రాబడికి అడ్డుగా ఉన్న సాటి పాత్రికేయుల మీదనే కేసులు నమోదవ్వడానికి కోవర్టులుగా ఉంటున్న గుంట నక్కల వ్యవహారం ఫోర్త్ ఎస్టేట్‌కి చీడగా




మారింది.అయితే ఈ కేసు వ్యవహారంలో సదరు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ నుంచి డబ్బులు తీసుకున్న విషయం నిజమే కావచ్చు.ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలు ఉండొచ్చు. అయితే సదరు రియల్ ఎస్టేట్ అనేక అక్రమాలకు పాల్పడుతోందంటూ తమ పత్రికలో కథనం రాశారు.జనం మంచి కోసం వార్త రాశారు.అభినందించాల్సిందే.మరి అంతలో ఏం అయింది? ఆ సంస్థతో రాయబేరాలు ఎందుకు? ఆ సంస్థ ఇచ్చిన డబ్బులు తీసుకోవడం ఎందుకు? ఆ సంస్థ వ్యాపార ప్రకటన తమ పత్రికలోనే వేసుకోవడం ఎందుకు? నిజాయితీ ఎక్కడ? సదరు రియల్ సంస్థ మోసాలంటూ ఆ పత్రికలో రాస్తారు,రెండు రోజులు తిరగకముందే అదే పత్రికలో మోసాలు చేస్తున్న సంస్థ అని వ్యాపార ప్రకటన వేసుకోవడం ఏంది? ఈ వ్యవహారం పూర్తిగా గడ్డి తినే వ్యవహారం కదా? అంటే కేవలం డబ్బుల కోసమే ఆ కథనం రాశారని, డబ్బులు ఇవ్వగానే బేరం కుదిరి సదరు రియల్ సంస్థ మంచి సంస్థగా మారిందా?. అంటే జనం కోసం మీరు మీరు రాసిన కథనం జనం కోసం కాదని..కేవలం ధనార్జనే ధ్యేయంగా రాసిందని తేటతెల్లం కావడం లేదా? మంత్రిగారి రాసలీలు త్వరలో మా పత్రికలో సంచలన కథనం చదవండి అంటూ గత ప్రభుత్వ హాయంలో ఓ పత్రికలో ఓ హెచ్చరిక వచ్చింది. అయితే ఈ కథనం ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూసిన పాఠకులకు ఒక్కరోజు సదరు మంత్రిగారితో సదరు పత్రిక నూతన క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న ఫొటో మొదటి పేజీలో దర్శనం ఇవ్వడంతో ఖంగుతినడం పాఠకుల వంతైంది.ఆ తర్వాత ఎన్ని యేండ్లు ఎదురు చూసినా ఆ రాసలీల కథనం రాలేదు.ఇలా ఒకటా రెండా అనేక దౌర్భాగ్యాలు.డబ్బుకోసం గడ్డితింటున్న కలం కేటుగాళ్లు అనేక మంది ఉన్న విషయం కూడా నిజమే.అంతమాత్రాన సమాజం మొత్తం చెడిపోయిందని చెప్పడం సరియైనది కాదు.ఇప్పుడు తమ సంస్థపైన తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపైన కేసులు పెడితే ఈ సంస్థ వ్యాపారం మొత్తం సక్రమమైనట్లేనా? తమ వ్యాపారంలో లొసుగులు లేకపోతే లక్షలాది రూపాయలను మీడియా సంస్థలకు ఎందుకు వెదజల్లుతున్నారు? తమ మీద వార్తలను ప్రచురితం చేయవద్దంటూ రూ.3 లక్షలకు ఎందుకు బేరం కుదుర్చుకున్నారు? అధిక లాభాలు వస్తాయని శ్రీగంధం మొక్కలను చూపెట్టి వ్యవసాయ భూములను అమ్ముతూ జనాలను మోసం చేయడం నిజం కాకపోతే వాస్తవాలను ప్రజల ముందు ఉంచి ఈ పదమూడేండ్లలో మీరు శ్రీగంధం మొక్కల ద్వారా లాభాలు ఆర్జించిన వారు ఎవరున్నారు? ఎంత మొత్తంలో శ్రీగంధం చెట్లను అమ్మి మీ దగ్గర ప్లాట్లు కొన్నవారికి లాభాలను పంచిపెట్టారు? అసలు మీరు చేస్తున్న భూముల రిజిస్ట్రేష్ వ్యవహారాలు సక్రమమేనా? మీ వద్ద ప్లాట్లు కొంటున్నవారికి మీ ఫాం ల్యాండ్ వ్యాపారం గురించి అవగాహన ఉందా? ఫాం ల్యాండ్‌లో స్థిరమైన కట్టడాలు కట్టవచ్చా? మీరు ప్రభుత్వాలకు చెల్లిస్తున్న జీఎస్టీ,ట్యాక్సులు వివరాలు సక్రమంగానే ఉన్నాయా? ఇలా అనేక అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సదరు రియల్ వ్యాపారులకు ఉంది. అలాకాకుండా మా జోలికి వస్తే కేసులు పెడతాం అంటూ కొందరు గుంట నక్కల సిండికేట్ జర్నలిస్టులను ఉపయోగించి కేసులు నమోదుచేస్తే మీ తప్పులు ఒప్పుకావు కదా? వెంటనే ప్రభుత్వం ఈ సంస్థ రియల్ దందాపైన సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కాకుండా మోసం జరగక ముందే సంస్థలు బోర్డులు తిప్పేయక ముందే వేలాది మంది జనాలని ముంచేయకముందే ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పాలకులు,అధికారుల మీద ఉన్నది.ఇప్పుడు ఈ సంస్థ మీద వస్తున్న ఆరోపణల్లో నిజానిజాల సంగతి నిగ్గుతేల్చాలి.లేదంటే రేపొద్దున ఏదైనా జరగరానిది జరిగితే అప్పుడు ప్రభుత్వం, అధికారులు అనేక చిక్కులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎందుకంటే గతంలో ఎన్నో పెద్ద సంస్థలు బోర్డులు తిప్పేసిన చరిత్రలు చూశాం.ఆనక తలలు పట్టుకున్న వ్యవహారాలను కూడా గమనించాం.మరి ఇప్పుడు ఈ వ్యవహారంలో కూడా అధికారులు తక్షణమే మేల్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఎందుకంటే ఈ దందా కొన్ని వందల కోట్ల రూపాయలతో ముడిపడి ఉన్నది కాబట్టి.

................

**మానసాని కృష్ణారెడ్డి**
**9618616110**
**8074124190**

.................................

## వేములవాడ విఆర్ఆర్ రైస్ మిల్ పై విజిలెన్స్‌కి

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు దండు వినోద్ ఫిర్యాదు

**వాస్తవం : వేములవాడ**

గత కొన్ని రోజులుగా జిల్లాలో రైస్ మిల్లర్ల దోపిడీ అక్రమాలు అరెస్టులు జరుగుతున్న పర్వంలో వేములవాడకు చెందిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం కుటుంబానికి చెందినటువంటి విఆర్ఆర్ రైస్ మిల్లు 2024 25 సంవత్సరంలోని ఖరీఫ్ పంటకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సిఎంఆర్ రైస్ 1232.773 మెట్రిక్ టన్నులు. దాదాపు 4 కోట్ల విలువ చేసే బియ్యాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా అక్రమాలు చేసినట్టు ఆధారాలతో రీజినల్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ కరీంనగర్ కి గురువారం సమర్పించి చట్టపరంగా రైస్ మిల్ ఓనర్లపై చర్యలు తీసుకొని అవసరమైతే మిల్లు ఓనర్లను జైలుకు పంపించి ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండు వినోద్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండు వినోద్ మాట్లాడుతూ..ఎంతో కష్టం చేసి రైతులు తమ పంటను విక్రయించడానికి ప్యాక్స్ ఐకెపి, డిసిసిబి సెంటర్లకు తీసుకొచ్చిన క్రమంలో చిన్నచిన్న కారణాలతోని వాళ్ళ ధాన్యాన్ని కట్ చేయడం క్వింటాలకు దాదాపు 8 నుంచి 10 కిలోలు కట్ చేయడం వంటివి రైస్ మిల్లర్లు చేస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు కావచ్చు ప్రజా ప్రతినిధులు కావచ్చు ఎలాంటి చర్యలు రైస్ మిల్లర్లపై తీసుకోకపోవడం బాధాకరం.ఇటు రైతుల వద్ద దోపిడీ, ప్రభుత్వం దగ్గర కూడా దోపిడీ చేయడం జరుగుతుందన్నారు. ఇలా రెండు వైపులా దోపిడీ చేస్తున్నప్పటికీ అధికారులు వారు చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కి ఆదేశాలు ఇచ్చి వారి పైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరినప్పటికీ ఇప్పటికీ ఎలాంటి స్పందన లేదు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అనే భయంతో చర్యలు తీసుకోవట్లేదా? లేక ఏదైనా ఒప్పందం జరిగిందా ఇద్దరి మధ్యలో అనేది అర్థం కావడం లేదు.మొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు గోపి వేములవాడకు వచ్చి రైతుల పక్షాన ప్రెస్ మీట్ పెట్టినట్టు పెట్టి రైతులను ఆదుకోవాల్సిందిగా రైతులకు డబ్బులు చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీ పార్టీకి చెందినటువంటి జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం రైతుల దగ్గర్నుంచి వారి ధాన్యాన్ని పంపించిన క్రమంలో క్వింటాలకు ఎనిమిది నుంచి పది కిలోల వరకు



కటింగ్లు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సినటువంటి సీఎంఆర్ చెల్లించట్లేదు అన్నది ఆధారాలు ఉన్నాయి. వీటి పైన దమ్ముంటే మీ జిల్లా ఉపాధ్యక్షులు కి చెప్పి ప్రభుత్వానికి చెల్లించాల్సిన సిఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి చెల్లించేలా చేయాలని చెప్పి రైతులను దోపిడీ చేస్తున్నటువంటి మీ పార్టీకి సంబంధించినటువంటి వ్యక్తి మీద చర్యలు తీసుకోవాలని చెప్పి డిమాండ్ చేశారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలనకు అప్రమత్తతే ఆయుధం

### మోసపూరిత వాగ్దానాలకు మోసపోవద్దు

### జిల్లా మహిళా,శిశు సంక్షేమ అధికారి మల్లేశ్వరి

**వాస్తవం : కాటారం**

అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కాటారం గిరిజన సంక్షేమ పాఠశాలలోజిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "మోసాల మాటున చిక్కుకున్న బాధితులు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా మహిళా,శిశు సంక్షేమ అధికారి మల్లేశ్వరి మాట్లాడుతూ ఉద్యోగాలు,విదేశీ ఉపాధి,ఉన్నత విద్య,సినిమా అవకాశాలు, ప్రేమ, వివాహం పేరుతో మహిళలు,యువతులు, బాలికలను అక్రమ రవాణాకు గురిచేసే ముఠాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా మానవ హక్కులను కాలరాసే అత్యంత ఘోర నేరమని, అనుమానాస్పద ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సీడీపీఓ రాధిక మాట్లాడు తూ - మహిళల రక్షణ, పునరావాసం కోసం ప్రభుత్వం సఖి వన్ స్టాప్ సెంటర్ ద్వారా పలు సేవలు అందిస్తోందన్నారు.



పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి మాట్లాడుతూ సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటనలు, అపరిచితుల తప్పుడు వాగ్దానాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీసీపీఓ వెంకటస్వామి, మహిళ సాధికారత మిషన్ కోఆర్డినేటర్ క్రిష్ణ బాలల రక్షణ చట్టాలు,181 మహిళా హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. అనంతరం మానవ అక్రమ రవాణా రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ సిబ్బంది మాధవి, అనూష, కళావతి, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్

**వాస్తవం : ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడతెరిపి లేని వర్షాలు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాలు కారణంగా వాగులు ప్రవహించే అవకాశం ఉందని వాగులు,వంకలు,చెరువులు,కాలువలు వద్దకు ఎవరు వెళ్లవద్దన్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదంఉన్నందున,పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యుత్ పరికరాలను మరియు పోల్స్ కు దూరంగా ఉండాలి.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించడానికి పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని,సహాయం కావాలన్నా డైల్ 100/112 కి లేదా స్థానిక గ్రామ పోలీస్ అధికారుల కి ఫోన్ చేయాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రణాళికాబద్ధంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు

### ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**వాస్తవం : వేములవాడ (ఆర్ సి ఇంచార్జి)**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వరుణ యాగ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఆలయ అభివృద్ధి, విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2023–24లో రూ.50 కోట్లు, 2024–25లో రూ.100 కోట్లు కేటాయించగా, అనంతరం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 45 శాతం పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో పూర్తి స్థాయిలో పనులు ముగించి, రాబోయే వెయ్యేళ్ల అవసరాలకు అనుగుణంగా రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తుల సూచనలు, సలహాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.12 కోట్లతో వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ లో ఆధునిక పార్కు, భారీ శివుడి విగ్రహం, మొక్కలు, నటరాజ విగ్రహం పనులు






పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే రూ.10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు, రూ.47 కోట్లతో వేముల వాడలో 80 అడుగుల రహదారి విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. భక్తులకు అన్నదాన సేవలను మరింత విస్తరిం చేందుకు రూ.35 కోటతో అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని తెలిపారు.ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వేములవాడ డిపోకు 20 కొత్త బస్సులు కేటాయించ డం, అలాగే రూ.1.60 కోట్లతో తిప్పాపూర్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయో గపడుతుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

### వైస్ చైర్మన్ చిట్టిబాబు

**వాస్తవం : అందోల్**



వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అందోల్ జోగిపేట మున్సిపల్ 15 వ వార్డ్ కౌన్సిలర్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వేడి చేసిన నీటిని వడపోసి తాగాలి అన్నారు. పాత ఇళ్ల వద్ద కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల వద్ద ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. వర్షం కురుస్తున్నపుడు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా పిల్లలు ఆడుకుంటూ విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లారని విద్యుత్ స్తంభాల జోలికి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతన్నలు వ్యవసాయ క్షేత్రంల వద్ద తిరిక లేకుండా పనిచేస్తారని వారు విష సర్పాల బారిన పడకుండా జాగ్రత్తగా పనులు చూసుకోవాలన్నారు.

# బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ఆపరేషన్ ముస్కాన్12 బృందం

**వాస్తవం : మాదాపూర్**

డివిజన్ ముస్కాన్-12 కార్యక్రమంలో భాగంగా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బిక్షాటన కనిపించిన బాలుడును అధికారులు సురక్షితంగా గుర్తించి, వారి తల్లిదండ్రులను గుర్తించి అప్పగించారు. తేదీ 28/07/2026 నాడు మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడు అనుమానాస్పద తిరుగుతుండగా పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బాలుడిని రక్షించి, రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్-12 బృందం చిన్నారులతో మాట్లాడి, ఎలాంటి ఆచూకీ తెలియజేయకపోవడంతో గవర్నమెంట్ బాలుర వసతి గృహంలో ఆశ్రమం కల్పించాం, ఆ తర్వాత వివిధ పోలీస్ స్టేషన్ కి బాలుని సమాచారం గురించి ఆరా తీయగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో బాలుడు మిస్సింగ్ కంప్లైంట్ రాగా 26/07/2026. ఇట్టి విషయాన్ని పరిశీలించగా తప్పిపోయిన అబ్బాయి కంప్లైంట్ బిక్షాటన చేసిన అబ్బాయిగా గుర్తించిన కెపిహెచ్బి ఆపరేషన్ ముస్కాన్ -12 వారి కుటుంబ వివరాలను సేకరించి తల్లిదండ్రులను గుర్తించింది. చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి, బాలల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బాలురను వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అనంతరం సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఆపరేషన్ ముస్కాన్-12 బృందానికి, అల్లాపూర్ ఎస్ హెచ్ ఓ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మియాపూర్ కృష్ణయ్య, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు శ్రవణ్ కుమార్, దేవేంద్ర చారి, ఏ హెచ్ టు యు పీసీ షారూఖ్, విజయ్ భాస్కర్ రెడ్డి, మోతిలాల్, అనిల్ కుమార్, జహీదా, ఆపరేషన్ ముస్కాన్-12 బృంద సభ్యులు పాల్గొన్నారు.



## నీటి సంరక్షణపై అధికారుల అవగాహన

**గ్రామ సభలలో వెల్లడించిన అధికారులు**



**వాస్తవం : అందోల్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జల సిరి కార్యక్రమంలో భాగంగా ఆందోల్ మండలంలోని ఆయా గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని చింతకుంట, తాలేల్మ, అన్నాసాగర్, కొండారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి తండా, డాకూర్, నేరేడిగుంట గ్రామపంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు సర్పంచ్ ల అధ్యక్షతన నిర్వహించడం జరిగింది, ఈ గ్రామసభలలో టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొని నీటి సంరక్షణ కార్యక్రమాలను గురించి అవగాహన కల్పించారు. ఇట్టి గ్రామసభలలో నీటి సంరక్షణ చర్యలను గురించి విబిజి రాంజీ పథకంలో భాగంగా ప్రస్తుతం చేపడుతున్న చేపట్టబోయే కార్యక్రమాలను గురించి వాటి ప్రాముఖ్యతను గురించి వివరించడం జరిగింది." ఇంటికో ఇంకుడు గుంత, పొలానికి పంటకుంట, ఊరికో ఊటకుంట వర్షాపు నీటిని ఒడిసిపెట్టి భూగర్భ జలాల పెంపుకు అందరూ కృషి చేయాలని వివరించారు.

# నేతన్నల సంక్షేమం,వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం

**జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్ వ్యవసాయ చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**రగుడు జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు**

**ఐడీఓసీలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఆర్డీ పాస్ బుక్‌ల పంపిణీ**

**వాస్తవం : సిరిసిల్ల**

సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను గురువారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.... సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. నేతన్నలకు ఏడాది పొడవునా పని కల్పించడంతో పాటు భద్రత, భీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం అధిక ధర చెల్లించాల్సి వచ్చినా నాణ్యమైన చీరలనే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. యార్న్ డిపో ఏర్పాటుతో చేనేత సహకార సంఘాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, నేతన్నల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు. సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు పని కల్పిస్తూ నాణ్యమైన చీరలు మహిళలకు అందిస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నేతన్న.. గీతన్న వేరు కాదని, జిల్లా నేతగా నేతన్న ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సిరిసిల్ల మోడల్ చీర మహిళలకు అందుబాటు ధరలో ఒకటి తయారు చేసి.. జీ ఐ ట్యాగ్ వచ్చేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. 2024--25 సంవత్సరానికి 6.80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది మంది నేతన్నలకు ఎనిమిది నెలలపాటు ఉపాధి కల్పించామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు అందించామని, ఇప్పటికే దాదాపు కోటి మీటర్ల చీరల ఉత్పత్తి పూర్తైందని తెలిపారు. మరో మూడు కోట్లకు పైగా మీటర్ల చీరల ఉత్పత్తికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 62 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామని వెల్లడించారు. నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్న ఆది శ్రీనివాస్, 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు రూ.2 విద్యుత్ సబ్సిడీ అమలులోకి తీసుకురావడం ద్వారా పరిశ్రమకు ఊతమిచ్చిందన్నారు. రూ.50 కోట్లతో వేములవాడ లో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నేతన్నల వృత్తి గౌరవాన్ని చాటిచెప్పేలా సిరిసిల్ల కలెక్టరేట్ సర్కిల్ వద్ద రూ.3 కోట్లతో వస్త్రం తయారీ దశల విధానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు నేతన్న వృత్తి గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దామని తెలిపారు. వారిపై గౌరవం, ప్రేమతో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.... వేములవాడ కు వచ్చే భక్తులు, పర్యాటకులు సేదతీరేలా.. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా గుడి చెరువు బండ్ పార్క్ పనులను పూర్తి చేసి.. ప్రారంభించామని తెలిపారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు, రోడ్డు విస్తరణ, రోడ్డు భద్రత చర్యలు తీసుకున్నామని, వస్త్రం తయారీలో వివిధ దశలను తెలుసుకునేలా విగ్రహాలను ఏర్పాటు అయ్యాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరలు చాలా నాణ్యతతో తయారు చేశారని గుర్తు చేశారు. వాటిని మహిళలకు పండగలు, ఇతర కార్యక్రమాలకు కట్టుకుంటున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో సారి కూడా ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి. గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.







# హుస్నాబాద్‌లో నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభం

**అధికారికంగా ప్రారంభించిన సీపీ రష్మీ పెరుమాళ్**

**వాస్తవం : హుస్నాబాద్**

హుస్నాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సీపీ రిబ్బన్ కత్తిరించి అవుట్‌పోస్ట్‌ను అధికారికంగా ప్రారంభించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ... హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను నివారించడానికి, ప్రజల సౌకర్యార్థం నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవుట్‌పోస్ట్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చి, విధులు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.గతంలో ట్రాఫిక్ విభాగం కొరకు ప్రత్యేక స్థలం లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది ఉండేదని, ఇప్పుడు పూర్తిస్థాయిలో అవుట్‌పోస్ట్ అందుబాటులోకి వచ్చినందున ట్రాఫిక్ క్రమబద్ధీకరణను మరింత బలోపేతం చేసేందుకు ఇక్కడికి అదనపు సిబ్బందిని కూడా త్వరలోనే కేటాయిస్తామని సీపీ స్పష్టం చేశారు.పట్టణ ప్రజలు, వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా ప్రమాణాలు మరియు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా అనుసరించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, హుస్నాబాద్ ఏసిపి సదానందం,హుస్నాబాద్ సీఐ శ్రీధర్ ,చేర్యాల సీఐ రమేష్,ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, డివిజన్ పీఎస్ హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి,కోహెడ ఎస్సై అభిలాష్, కొమురవెల్లి ఎస్ఐ మహేష్, అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.






# గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం



**వాస్తవం : వేములవాడ**

విటిడిఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ పన్నెండు కోట్ల నిధులతో నిర్మించిన వేములవాడ గుడి బండ్ పార్కును గురువారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నటరాజ విగ్రహం, సప్త మాతృకల విగ్రహాలు మొక్కలు,భారీ శివుడి విగ్రహాన్ని వారు పరిశీలించారు.

# బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్**

**వార్షిక తనిఖీల్లో భాగంగా ఏసీపీ కార్యాలయం తనిఖీ**

**వాస్తవం : హుస్నాబాద్**

వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట కమీషనర్ ఆఫ్ పోలీస్ రష్మి పెరుమాళ్ గురువారం హుస్నాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న కమిషనర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆమె కార్యాలయ ఆవరణలో పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ మొక్కను నాటారు. అనంతరం సీపీ రష్మీ పెరుమాళ్ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, పోలీస్ స్టేషన్‌లోని అన్ని రకాల రికార్డులను మరియు ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను నిశితంగా తనిఖీ చేశారు.ఏసీపీ సదానందం కు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు:ఎస్సీ,ఎస్టీ,పోక్సో మరియు ఇతర గ్రేవ్ కేసుల దర్యాప్తును నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.కార్యాలయానికి సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, పారదర్శకంగా ఉంచాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో ఓపికగా మాట్లాడి, వారి సమస్యలను వినాలని అధికారులకు సూచించారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాటికి త్వరగా పరిష్కారం లభించేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా డివిజన్ లోని అన్ని గ్రామాలలో సీసీటీవీ కెమెరాలను అమర్చేలా అవగాహన కల్పించాలని సూచించారు.సిద్దిపేట పోలీస్ ఉద్యోగమిత్ర పోర్టల్ గురించి అన్ని గ్రామాలలో యువతకు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందంతో పాటు హుస్నాబాద్ సీఐ శ్రీధర్, చేర్యాల సీఐ రమేష్, కొమురవెల్లి ఎస్సై మహేష్, హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి, అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్, కోహెడ ఎస్సై అభిలాష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# భారీ వర్షాలు
# రంగంలోకి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**- క్షేత్రస్థాయిలో పరిస్థితుల పరిశీలన**



**వాస్తవం : గోదావరిఖని, జులై 30:**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గురువారం రామగుండం కార్పోరేషన్ పరిధి 50, 9, 38వ డివిజన్‌లలో పర్యటించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వెంటనే నీటి తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వేగంగా స్పందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఏసీపీ మడత రమేష్, కార్పొరేటర్లు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలస్యంగా వచ్చిన వాన.. జోరుగా వరినాట్లు

**వర్షంతో కళకళలాడిన పొలాలు**

**పత్తి రైతుల్లోనూ ఉత్సాహం**

**ఖరీఫ్ సీజన్‌కు అనుకూలం**

**మిర్చి నారుకు సన్నాహాలు**

**చర్ల : వాస్తవం**

ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యమైనా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చర్ల మండలంలో వ్యవసాయ కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. వాతావరణం చల్లబడడంతో రైతులు జోరుగా వరి నాట్లు ప్రారంభించారు.గత వారం రోజులుగా ఎండలు మండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. అయితే ఒక్కసారిగా కురిసిన వర్షాలకు పొలాల్లో తేమ పెరిగి, నారుమడులు సిద్ధమయ్యాయి.పొలాల్లో సందడి.. వరి, పత్తి, మిర్చి కి ఊపుచర్ల మండలంలోనిపలు గ్రామాల్లో రైతులు ట్రాక్టర్లతో పొలాలు దున్నుతున్నారు. యువకులు, మహిళలు నారుమడుల నుండి నారును పీకి నాట్లు వేస్తున్నారు. కూలీలకు డిమాండ్ పెరగడంతో వ్యవసాయ క్షేత్రాలు కళకళలాడుతున్నాయి.“ కాలం పోయిందని భయపడ్డాం. ఇప్పుడు వర్షం పడడంతో ధైర్యంగా నాట్లు వేస్తున్నాం. ఈసారి మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం” అని మైపా సోమరాజు అనే రైతు అన్నారు.వర్షాలతో పాటు వరి రైతులతో పాటు పత్తి రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తడి సరిపోవడంతో పత్తి విత్తనాలు నాటినందుకు వాతావరణం అనుకూలంగా ఉందని, ఈసారి పత్తి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.మిర్చి నారు కోసం సన్నాహాలు:వరి నాట్ల తరువాత మండలంలో మిర్చి సాగు విస్తారంగా ఉంటుంది. అందుకోసం రైతులు ఇప్పటి నుండే మిర్చి నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు.వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు నిండుతున్నాయి. ముఖ్యంగా బితాళిపేరు ప్రాజెక్టులోకి వరద నీరు అధికంగా చేరడంతో అధికారులు దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.మరో 3-4 రోజులు ఇదే తరహాలో వర్షాలు కురిస్తే చర్ల మండలంలో 80% వరి సాగు పూర్తయ్యే అవకాశం ఉందని గుండ్ల రమేష్ అనే రైతు సంతోషం వ్యక్తం చేశాడు



## జవ్వాది ఉమామహేశ్వరావు దశదిన కర్మల్లో టీపీసీసీ నేత



కుటుంబ సభ్యులను పరామర్శించిన నల్లపు దుర్గాప్రసాద్

వాస్తవం : చర్ల

ప్రముఖ కాంట్రాక్టర్, అఖిల హాస్పిటల్ చైర్మన్ జవ్వాది ఉమామహేశ్వరావు దశదిన కర్మల కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉమామహేశ్వరావు చేసిన సేవలు ఆదర్శప్రాయమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ నాయుడు, కాపుల నాగరాజు, పున్నం రామకృష్ణతో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి

### చందుర్తి సిఐ కట్ల రవీందర్



వాస్తవం: చందుర్తి

వర్షాకాలం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని చందుర్తి సిఐ కట్ల రవీందర్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడానికి ప్రధాన సురక్షిత చర్యలు అత్యవసరమైతేనే బయటకు రండి. భారీ వర్షాల వల్ల రోడ్లపై నీరు నిలిచే ప్రమాదం ఉంది. అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోండి. నీటి ప్రవాహాల వద్దకు వెళ్లవద్దు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదులు, రిజర్వాయర్ల దగ్గరకు వెళ్లడం ప్రమాదకరం. చేపల వేట నిషేధం వర్షాల వేళ చెరువులు, ప్రాజెక్టులు లేదా ప్రవాహాల వద్ద చేపల వేటకు వెళ్లకూడదు. విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్త: విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండండి. తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకవద్దు. రక్షణ లేని చోట ఆశ్రయం వద్దు. వర్షం పడుతున్నప్పుడు పెద్ద చెట్ల కింద గానీ, పాతబడిన లేదా శిథిలావస్థలో ఉన్న భవనాల్లో గానీ నిలబడవద్దు. వరద నీటిలో మునిగిన కల్వర్టులు, దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిల పై ప్రయాణించకండి. రోడ్లపై నీరు ఉన్నచోట వాహనాలను వేగం తగ్గించి జాగ్రత్తగా నడపండి. చెరువు కట్టల పట్ల అప్రమత్తత: నీటిమట్టం పెరుగుతున్నందున చెరువు కట్టలు బలహీనపడే అవకాశం ఉంది. ఏమాత్రం ప్రమాదం అని పించినా అధికారులకు సమాచారం ఇవ్వండి. అత్యవసర సహాయం, యంత్రాంగం డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏ క్షణంలో నైనా సహాయం అందించడానికి డయాస్టర్ రెస్పాన్స్ టీమ్ లు సిద్ధంగా ఉన్నాయి. అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే క్రింది నంబర్లకు ఫోన్ చేసి పోలీసు, రెవెన్యూ శాఖలకు సహకరించండి. అత్యవసర సహాయంకు 100, 112 లకు సంప్రదించాలని సిఐ కట్ల రవీందర్ సూచించారు.

## ముస్తాబవుతున్న మున్సిపాలిటీ నూతన భవనం

### గత బీఆర్ఎస్ పాలనలో భవనానికి శంకుస్థాపన నేడు అదే బిఆర్ఎస్ మున్సిపల్ పాలకవర్గం హయాంలో ప్రారంభానికి తయ్యార్



వాస్తవం : తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపాలిటీ కి నూతన కార్యాలయ భవనం అందుబాటులోకి రానుంది. ప్రజల సౌకర్యార్థం గతంలో గ్రామ పంచాయతీ గా ఉన్న తిరుమలగిరిని సమీప గ్రామాలైన మాలిపురం, అనంతారం, నందాపురం లను కలిపి 2019 లో మున్సిపాలిటీ గా ఏర్పాటు చేశారు. తిరుమలగిరి మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ మొదటి చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. కానీ పరిపాలన మాత్రం పాత పంచాయతీ కార్యాలయంలోనే సాగించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ 2023 లో నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించి శంకుస్థాపన చేయడం జరిగింది. దురదృష్టవశాత్తు అదే సంవత్సరం ఎన్నికలు రావడం బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడం ఎమ్మెల్యే గా గాదరి కిషోర్ ఓటమి చెందడం తో భవన నిర్మాణ పనులు మందగించాయని చెప్పొచ్చు. కాలక్రమేణా నత్తనడకన నిర్మాణ పనులు సాగిస్తూ ఎట్టకేలకు తిరిగి మున్సిపాలిటీ పీఠాన్ని తిరిగి రెండవసారి కైవసం చేసుకున్న అదే బిఆర్ఎస్ పాలకవర్గం హయాంలోనే ప్రారంబానికి సిద్ధమవుతుండడం పార్టీ వర్గాలకు ఆశజనకంగా చెప్పవచ్చును. ఇకపోతే నూతన భవనంలో అధికారులు, పాలకవర్గం నిత్యం అందుబాటులో ఉంటూ మున్సిపాలిటీలోని సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## పాలవాగు పొంగింది.. ప్రజా జీవనం నిలిచింది

### భారీ వర్షాలకు శంకర్‌పల్లి గ్రామానికి రాకపోకలు బంద్ తాగునీరు, విద్యుత్ సమస్యలతో రెండు రోజులుగా కటిక చీకట్లో పల్లె వాసుల జీవనం





వాస్తవం : మందమర్రి

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా.. మందమర్రి పట్టణంలోని కేకే-5 మైన్ నుంచి శంకర్‌పల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న పాలవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఏదైనా ప్రమాదం సంభవిస్తే..108 వాహనం వెళ్లే సౌకర్యం కూడా లేదు. తాగునీటి సరఫరా చేసే బోరు రెండు రోజులుగా రక్షణ లేకుండా బురద నీటిలో మునిగి విద్యుత్ సరఫరా లేక పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య మరింత తీవ్రంగా మారింది. ప్రజలందరూ కటిక చీకట్లో జీవనం కొనసాగిస్తున్నారు. ఈ పల్లె ప్రజలకు తాగు నీరును అందించే బోరు సమీపంలో ఉన్న 12 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఈ ప్రమాదకర పరిస్థితిపై పలుమార్లు అధికారులకు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో పోలీసులు ఈ గ్రామాన్ని సందర్శించి ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నప్పటికీ, గ్రామ సమస్యలను పరిష్కరించాల్సిన సర్పంచ్ మాత్రం ఈ గ్రామాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు వెంటనే స్పందించి పాలవాగుపై బ్రిడ్జి, రహదారి, విద్యుత్, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే గ్రామ ప్రజలంతా కలిసి మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడించిఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ఆగస్టు 10న జైళ్లు నింపుదాం

### మచ్చ వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వ విధానాలపై చర్లలో ఆగ్రహ జ్వాలలు



వాస్తవం : చర్ల

కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం బి.ఎస్ రామయ్య భవన్ లో సీఐటీయూ , రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల మండల సదస్సు పాయం రాధాకుమారి అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు అప్పగిస్తున్నారని, 29 కార్మిక చట్టాలను మార్చి కార్మికుల హక్కులు హరిస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని, ఎన్ఆర్ఈజీఏ రద్దుతో పేదలకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా "జైల్ భరో" కార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు యలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరిలో చెరువు ఉందా! చెరువులో ఊరు ఉందా!

## జలదిగ్బంధనంలో కోమటిచేను

వాస్తవం : కాసిపేట
రాష్ట్రవ్యాప్తంగా గత మూడు రోజులుగా పడుతున్న భారీ వర్షాల వలన కోమటి చేను గ్రామంలో సరియైన డ్రైనేజీ కాలువలు లేకపోవడం వలన వర్షపు నీరు ఇండ్ల చుట్టూ చేరి "చెరువులో ఊరుందా!లేదా ఊరిలో చేరువుందా!" అనే విధంగా తయారయిందని ఇలా వర్షపు నీరు నిలువ కావడానికి కారణం గతంలో ఉన్నటువంటి డ్రైనేజీ కాలువల నుంచి పూడిక తీయకపోవడం వలన అవి మూసుకుపోయి వరద నీరు ఇండ్ల చుట్టూ, మరియు ఇండ్లలోకి ప్రవేశిస్తుందని అదేవిధంగా కొందరు తమ అవసర నిమిత్తం వర్షపు నీరు పోయే మోరీలను మూసి వేయడం వలన చినుకు వర్షం పడ్డ బయటకు పోయే దారి లేక ఊరి మధ్యలో ఇండ్ల చుట్టూ వర్షపు నీరు నిలిచి ఉంటున్నాయని, గ్రామపంచాయతీ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. దీనివలన వర్షపు నీరు బయటికి పోయే దారి లేక ఇండ్ల లోపలికి వచ్చి, మట్టి గోడలు తడిచి ఇండ్లు కూలిపోతున్నాయని ఇకనైనా తమ పరిస్థితిని గ్రామపంచాయతీ



అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా పరిశీలించి తమకు సరైన పరిష్కారం చూపాలని కోరుతున్నామన్నారు. ఇట్టి పరిస్థితిని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ జాడి. శంకరయ్య మాణిక్య,ఉపసర్పంచ్.కొడప అనంతరావు ప్రస్తుత పరిస్థితిని చక్కబెట్టడానికి ఇండ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీరు బయటికి పోయేలాగా జెసిబి తో కాలువ తీయించారని త్వరలోనే గ్రామానికి డ్రైనేజీ కాలువలు కట్టించి శాశ్వత పరిష్కారం చూపిస్తామని మాట ఇచ్చారన్నారు.

# రాజ్యాధికారంలో భాగస్వామ్యం మా లక్ష్యం



## యాదయ్య

వాస్తవం : రాజేంద్రనగర్
బీసీలు న్యాయపరమైన సామాజిక విద్య ఆర్థిక హక్కులతో పాటు రాజ్యాధికారంలో భాగస్వామ్యం సాధించేవరకు మా పోరాటం కొనసాగుతుందని బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు. గురువారం మండల కార్యాలయంలో ఇంచార్జ్ జే. ఆనంద్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ... స్థానిక సంస్థలలో, పార్లమెంట్, అసెంబ్లీలలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలన్నారు. వార్షిక బడ్జెట్లో 50 శాతం బీసీలకు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ 29వ జీవోను రద్దు చేయాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం సబ్ కోటా కేటాయించాలని అన్నారు. అనంతరం నియోజకవర్గంలోని మూడు మండలాలలో బీసీ హక్కుల సాధన సమితి నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా జే. ఆనంద్ గౌడ్, అధ్యక్షులుగా జే. సదానంద గౌడ్, ఉపాధ్యక్షులు గుజ్జరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కే.మనోజ్, సహాయ కార్యదర్శిగా కే. మౌనిక తో పాటు 15 మందిని ఎన్నుకొన్నారు. అంతేకాకుండా గండిపేట మండల అధ్యక్షునిగా ఆర్ శ్రీనివాస్, శంషాబాద్ మండల అధ్యక్షునిగా డి. శ్రీనివాస్ ఎంపికయ్యారు.ఈకార్యక్రమంలో జె. విజయ ఆనంద్ గౌడ్, రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి కన్య గారి లక్ష్మి మునేశ్వరి జి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

# రహస్యంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న హాస్పిటల్ సీజ్

వాస్తవం : తిరుమలగిరి
తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని తొర్రూర్ రోడ్డు పై పున గల శ్రీ బాలాజీ ప్రవేట్ హాస్పిటల్ లో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మాతా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించగా హాస్పిటల్ యాజమాన్యం రహస్యంగా గర్భస్థ మహిళలకు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తేలింది. స్కానింగ్ పరికరాన్ని స్వాధీనం చేసుకుని, శ్రీ బాలాజీ హాస్పిటల్ ను సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మండల కేంద్రంలోని గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పేర్లు నమోదు చేసుకొని వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణీ స్త్రీల నమోదు ను అధిక సంఖ్యలో చేసి వారిని ప్రభుత్వ దావఖానాల్లోనే ప్రసవాలు జరిగేటట్లు చూడాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం






సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీ లో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నబియా తబుస్సుం, ఎస్ఓ ఎంఎ బాసిత్, డిప్యూటీ డిఎంఓ సంజీవరెడ్డి, ఏఎస్ఓ మత్స్యగిరి, ఎంపీహెచ్ఏ కిరణ్ శర్మ, డిసిఎం ఉపేందర్, డిఈఓ శంకర్, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేత



వాస్తవం : అడ్డగూడూరు
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన బాలెంల మల్లిస్వామి కుటుంబానికి గురువారం అడ్డగూడూరు బిఆర్ఎస్ నాయకులు 40 వేల రూపాయలు బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి వనజ సైదులు గౌడ్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ పోన్నాల వెంకటేశ్వర్లు, బి ఆర్ ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు నాగులపల్లి దేవగిరి, మాజీ ఎంపీటీసీ పూలపెల్లి జనార్ధన్ రెడ్డి, నాయకులు మాధాను ఆంథోని, గజ్జెల్లి రవి, ఉప సర్పంచ్ వరిగడ్డి లోకేష్, పరమేష్ గూడెపు, పయ్యావుల రమేష్,దాసరి బాలరాజు, సోమిరెడ్డి పురుషోత్తం రెడ్డి, బీరప్ప, మల్లయ్య, రామక్రిష్ణ, అవినాష్, పరమేష్, మహేష్, మత్స్యగిరి, సురేష్, గజ్జెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో జాలువారుతున్న రాముని గుండాల జలపాతాలు

వాస్తవం : గోదావరిఖని
అందాలకు ఆధ్యాత్మికతకు నిలయంగా మారిన రాముని గుండాల కొండ రామగుండం ప్రాంతంలోని చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన రాముని గుండాల కొండ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో అపూర్వమైన ప్రకృతి సోయగాలతో భక్తులను సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొండపై నుంచి అనేక ప్రాంతాల్లో జాలువారుతున్న సహజ జలపాతాలు కనువిందు చేస్తూ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. వర్షపు నీరు కొండలపై నుంచి ఉప్పొంగి ప్రవహిస్తూ తెల్లని జలధారలుగా కిందకు దూకుతున్న దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను అలరిస్తున్నాయి ఈ అందాలను తిలకించేందుకు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు, యువత కుటుంబ సభ్యులు తరలివస్తున్నారు. కొండపై ఉన్న పవిత్ర గుండాలలో భక్తులు ఆనందోత్సాహాలతో స్నానాలు చేస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతున్నారు.స్థానికుల విశ్వాసం ప్రకారం త్రేతా యుగంలో శ్రీరాముడు సీతాదేవి లక్ష్మణుడు దండకారణ్యంలో సంచరిస్తున్న సమయంలో ఈ ప్రాంతంలో కొంతకాలం నివసించినట్లు పురాణగాథలు చెబుతున్నాయి. ఆ కాలానికి సంబంధించిన ఆనవాళ్లుగా భావించే 108 పవిత్ర గుండాలు ఈ కొండపై ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. ఈ గుండాలలో స్నానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని, శారీరక--మానసిక ప్రశాంతత కలుగుతుందని భక్తుల విశ్వాసం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఈ 108 గుండాలు నీటితో నిండి మ



రింత ఆహ్లాదకరంగా మారాయి ప్రకృతి అందాలు ఆధ్యాత్మిక విశ్వాసం వర్షాకాలపు ఆహ్లాదకర వాతావరణం కలిసి రాముని గుండాల కొండను ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిపాయి ప్రతి రోజు వందలాది మంది భక్తులు పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు.అయితే కొండ ప్రాంతంలో రాళ్లు జారే అవకాశం ఉన్నందున సందర్శకులు తగిన జాగ్రత్తలు పాటించాలని లోతైన గుండాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.ప్రకృతి వైభవం చారిత్రక నేపథ్యం ఆధ్యాత్మిక విశిష్టత కలగలిసిన రాముని గుండాల కొండ ప్రస్తుతం రామగుండం ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ భక్తులను, ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

## తక్షణ సహాయానికై మూడు ప్రత్యేక రెస్క్యూ బృందాలు సిద్ధం

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల, జులై 30(వాస్తవం )

జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు జగిత్యాల జిల్లా పోలీసులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉన్నారని, తక్షణ సహాయానికై మూడు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.గురువారం మీడియాతో మాట్లాడారు. వాగులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద పరిస్థితులను నిరంతరం పర్య వేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు అన్నారు.ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ జిల్లా అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందిన మూడు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ బృందాలకు లైఫ్ జాకెట్లు, తాళ్లు, రెస్క్యూ కిట్లు, ఇతర ప్రత్యేక భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచామని, వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెంటనే రక్షించడం వంటి చర్యలకు వీటిని వినియోగిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు వర్షాల నేపథ్యంలో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు పోలీసు బృందాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే పడవలు, ఇతర రక్షణ పరికరాలతో సహాయక చర్యలను మరింత వేగవంతం చేస్తామని వెల్లడించారు. ప్రజలు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని, అధికారుల సూచనలను పాటించాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# హుస్నాబాద్‌లో నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభం

### అధికారికంగా ప్రారంభించిన సీపీ రష్మీ పెరుమాళ్

వాస్తవం : హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ రిబ్బన్ కత్తిరించి అవుట్‌పోస్ట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డిని ఆసీనులు గావించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ... హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను నివారించడానికి, ప్రజల సౌకర్యార్థం నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవుట్‌పోస్ట్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చి, విధులు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.గతంలో ట్రాఫిక్ విభాగం కొరకు ప్రత్యేక స్థలం లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది ఉండేదని, ఇప్పుడు పూర్తిస్థాయిలో అవుట్‌పోస్ట్ అందుబాటులోకి వచ్చినందున ట్రాఫిక్ క్రమబద్ధీకరణను మరింత బలోపేతం చేసేందుకు ఇక్కడికి అదనపు సిబ్బందిని కూడా త్వరలోనే కేటాయిస్తామని సీపీ స్పష్టం చేశారు. పట్టణ ప్రజలు, వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా ప్రమాణాలు మరియు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా అనుసరించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, హుస్నాబాద్ ఏసిపి సదానందం, హుస్నాబాద్ సీఐ శ్రీధర్ , చేర్యాల సీఐ రమేష్, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, డివిజన్ పీఎస్ హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, కోహెడ ఎస్సై అభిలాష్, కొమురవెల్లి ఎస్ఐ మహేష్, అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.





# జిల్లాలో విస్తారంగా వర్షాలు

### గడ్డు పరిస్థితిలో వర్షంతో రైతులకు ఆనందం ఊపందుకున్న వరి పొలాలు

వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

వర్షాకాలంలో కార్తెలు దాటుతున్న వర్షాలు కురిపించడం రైతు లు అయోమయానికి గురయ్యారు. ఎల్ నినో ప్రభావిత ఉందని ప్రభుత్వం, అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వరి పొలాలు కాకుండా పప్పు ధాన్యం, ఆరుతడి పంటలు సాగించుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయర్థులో రైతులు వరి పొలాలనుసాగు చేసుకోవాలని ఆశతో దున్ని నాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. వర్షాలు రాకపోవడంతో గ్రామ దేవతలకు జలాభిషేకలు, కప్పతల్లి ఆటలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరి ముదురుతుండతో రైతులు నిరాశన గురయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు రోజులపాటు నిరాటంకంగా విస్తారంగా వర్షలు కురిపించడంతో రైతులకు ఊపిరి పీల్చుకొని ఉల్లాసంగా వరి పొలాల్లో నాట్లు వేస్తున్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో బోయినపల్లిలో అత్యధికంగా 54.7 మిల్లీలీటర్,వేములవాడ రూరల్‌లో 53.5 మిల్లీలీటర్,ములవాడలో 49.9 మిల్లీలీటర్,చందుర్తిలో 43.3 మిల్లిలీటర్,రుద్రంగిలో 37.3 మిల్లీలీటర్,కోనరావుపేటలో 35.7 మిల్లీలీటర్,వీర్నపల్లిలో 29.3 మిల్లి లీటర్, సిరిసిల్లలో 28.9 మిల్లీలీ లీటర్,ఎల్లారెడ్డిపేటలో 25.4 మిల్లీలీటర్,గంభీరావుపేటలో 24.2 మిల్లీలీటర్,ముస్తాబాద్‌లో 26.1 మిల్లీ లీటర్,తంగళ్లపల్లిలో 29.5 మిల్లీలీటర్,ఇల్లంతకుంటలో 27 .7 మిల్లీమీటర్‌వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 35.8 మి.మీ.గా నమోదైంది.జిల్లాలోని రిజర్వాయర్ లు, చెరువులు, కుంటలల్లోకి వర్షంతో వరదలు, వంకలు పరవళ్ళతో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.గంభీరావుపేట మండలం నర్మల ప్రాజెక్టు నుండి పాల్వంచ బ్రిడ్జ్ ద్వారా వరద పెరిగింది.కోనరావుపేట మండలం మూలవాగు, నక్క వాగు, పెంటి వాగు వరద పెరిగింది. వేములవాడ మూలవాగు వరదతో గంగమ్మ తల్లికి పూజలు చేశారు. మరో రెండు రోజులు వర్షాలు కురిపిస్తాయని మరింత చెరువు,కుంటల్లో నీరు చేరుతుందని రైతులు అంటున్నారు.



# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

వాస్తవం : రాజేంద్రనగర్

శాంతియుత వాతావరణం లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పలు శాఖల అధికారులకు ఆదేశించారు. గురువారం కిస్మత్పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన గణేష్ నిమజ్జన ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గణేష్ మండపాల నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని అన్నారు. ముఖ్య




మంత్రి ఆదేశాలతో గణేష్ మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. జోనల్ కమిషనర్ కృషితో హనుమాన్ నగర్ పత్తికుంట ను మరింత అందంగా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. పెద్ద ఎత్తున వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పత్తికొండ, పల్లె చెరువు వద్ద అన్ని శాఖల అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఈ నిమజ్జనోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కోరారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని రాజేంద్రనగర్ జోన్ డిసిపి ఎస్. శ్రీనివాస్ కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, ఏసీపీ శ్రీనివాస్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఆలె భాస్కర్, కార్యదర్శి కే. మహేందర్, ఎన్. మల్లారెడ్డి, నిరంజన్, ఎస్ ఈ నరేందర్ గౌడ్, విద్యుత్ శాఖ డిఈ రత్నాకర్ రావు, డిప్యూటీ కమిషనర్లు బి. సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, జలమండలి జిఎం జోహార్ అలీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.